
# శ్రీమద్భాగవత ప్రశ్నోత్తర మాలిక




## "శ్రీ గురుభ్యో నమః" విద్యార్థిని విద్యార్థుల సేకరణ

[www.gurujnanam.org](http://www.gurujnanam.org)

# విషయ సూచిక


| CD# | | Page |
|---|---|---|
| 2.1 | | |
| | వరాహావతారం | 1 |
| | కపిల మహాఋషి చరిత్ర | 7 |
| 2.2 | | |
| | జీవజగదేశ్వరం | 13 |
| | సాధన | 17 |
| 2.3 | | |
| | కపిల గీత | 23 |
| | కపిల గీత జ్ఞానం - ధ్రువుడు తపస్సుకి మధువనం చేరుకొనుట | 30 |
| 2.4 | | |
| | ధ్రువోపాఖ్యానం | 36 |
| | ధ్రువ చరిత్ర (తపస్సు, విష్ణుసాక్షాత్కారం,ధ్రువుడి రాజ్యపాలన,అంత్యమున పరమపదము ) | 39 |
| 2.5 | | |
| | సాధన అంగరాజు రాజ్యము విడిచి వెళ్ళుట మరియు వేనరాజు మరణించడం , పృధూపాఖ్యానం | 43 |
| | పృథు పరమగతిని పొందుట, పురంజనోపాఖ్యానము | 51 |
| 3.1 | | |
| | భరతోపాఖ్యానం-1 | 60 |
| | భరతోపాఖ్యానం-2 | 64 |


gurujnanam.org

# వరాహావతారం

1.భాగవతానికి భాష్యమును రచించిన వారు ఎవరు?

జ. శ్రీధరాచార్యుల వారు.

2.కృష్ణుడిని ఏ తత్త్వముగా భాగవతము తెలియ చేస్తుంది?

జ.కృష్ణుడిని బ్రహ్మ తత్త్వముగా తెలియ చేసే గ్రంధము భాగవతము.

3.బ్రహ్మదేవుడి ధ్యానంలోంచి ఎన్ని రూపాలు విడుదల అయ్యాయి? అవి ఏవి?

జ.రెండు రూపాలు విడుదల అయ్యాయి. ఇదే ప్రధమ మిధునము.శతరూప, స్వాయంభు మనువు.

4.బ్రహ్మదేవుడు కుంభకంలో ధ్యానం చేసి తిరిగి విడిచి పెట్టినప్పుడు నాసికా రంధ్రమునుంచి వచ్చినది ఏ అవతారము?

జ.వరాహావతారం.



5.వరాహ గర్జనని ఏమి అంటారు?

జ.ఘుర్ఘర ధ్వని.

6.వరాహమూర్తి ఎవరి స్వరూపము?

జ.నారాయణుని యొక్క స్వరూపము.

7.అధ్వరము అంటే ఏమిటి?

జ.యజ్ఞము.

8.వరాహస్వామి ఏ రూపుడు?
జ.యజ్ఞరూపుడు.

9.సనకసనందనాదులను వైకుంఠంలోకి వెళ్ళకుండా ఆపినదెవరు?
జ.జయవిజయులు.

10.సనకసనందనాదుల కథలో నీతి ఏమిటి?
జ.రజోగుణము, తమోగుణములని తగ్గించుకుని, సత్వగుణమును పెంచుకోవాలి.



11.హిరణ్యాక్షుడు,హిరణ్యకశిపులు ఎవరి సంతానము?
జ.ధితి, కశ్యపుల సంతానం.

12.జలాధిపతి ఎవరు?
జ.వరుణుడు.

13.యుద్ధంలో జయించాలి అన్న కోరికని ఏమంటారు?
జ.రణకండూతి.

14. నారాయణుడు అంటే అర్థం ఏమిటి?
జ. జలము అయనముగా చేసుకున్న వాడు నారాయణుడు. పరమార్థం, సర్వ జీవులకూ (నారములు) ఆధారం అయినవాడు.

15.నారదుడు అంటే ఎవరు?

జ.నారదుడు అనగా మొత్తం ఋషులు అందరికి ప్రధానమైనటువంటివాడు, దేవ ఋషి ఆయన. నారాయణ సంకల్పాన్ని భూమిపై ప్రవర్తింప చేసే ఒకానొక ఋషిశక్తి నారదుడు.

16.భూమి మీదకి భాగవతము, రామాయణము, రావడానికి కారణము ఎవరు?

జ.నారద మహర్షి.

17.వరాహస్వామి శరీరము ఏ స్వరూపము?

జ.యజ్ఞ స్వరూపము. ఆయనఒక్కొక్క అవయవ భాగము యజ్ఞము.

18.వరాహస్వామి ఇతర నామమలు ఏమిటి?

జ. కృష్ణ, గోవింద.

19.అచ్యుతః అంటే అర్ధం ఏమిటి?

జ.తన స్థితి నుంచి తాను జారడు. తనని పట్టుకున్నవారిని జారనివ్వడు.

20.సుషేణః అంటే అర్ధం ఏమిటి?

జ.లోకానికి మేలు చేసే సేనలు (దేవతలు).

21.అజితః అంటే అర్ధం ఏమిటి?

జ.ఎవరు ఓడించలేరు. అది ఆయన స్వభావము.



22.అనువాకము అంటే ఏమిటి?
జ. వైదిక సమూహము.

23.యజ్ఞము అంటే ఏమిటి?
జ.మానవ జీవితం, భూమి, ప్రకృతి వ్యవస్థ -క్షేమము నడిచి పోవడానికి ఋషులు దర్శించిన ఒకానొక విజ్ఞానము యజ్ఞము.

24.యజ్ఞము చేసేటప్పుడు నాలుగు హోమములు చేసేవారు వుంటారు వారి పేరులు ఏమిటి?
జ.హోత, ఉద్గాత, అధ్వర్యుడు, బ్రహ్మ.

25. ఈశాను కథలు అనగా ఏమిటి?
జ.భగవానుడు జగద్రక్షణ కోసం ధరించిన వివిధ అవతారములను ఈశాను కథలు అంటారు.

26.భూమిని తప్పించిన వాడెవరు?
జ.హిరణ్యాక్షుడు భూమి గతిని తప్పించి (దాచేసి) అగమ్యమైన స్థితిలో ఉంచాడు.

27.ప్రాణాయామములో ఎన్ని ప్రక్రియలుంటాయి?
జ.ప్రాణాయామములో 3 ప్రక్రియలుంటాయి. పూరకము, కుంబకము మరియు రేచకము.

28. వరాహ అవతారాన్ని దేవతలు ఎలా స్తుతించారు?
జ.జపోలోక తపోలోక వాసులు వరాహస్వామిని తమ దుఃఖాన్ని పోగొట్టగల నారాయణ స్వరూపమని తలచి ఋగ్ , యజుర్, సామ మంత్రాలతో స్తుతించారు.

gurujnanam.org

29. పోతనగారు వరాహస్వామిని ఏమని వర్ణించారు?
జ.క్షోణిని రక్షించడానికి వచ్చిన ఘోణి - అని పోతనగారు వర్ణించారు.

30.నారాయణుడు జయవిజయులు తరించడానికి చెప్పిన పద్ధతులు ఏవి?
జ. నన్ను తిరిగి చేరుకోవాలంటే 2 పద్ధతులు. అవి 1. ప్రేమపూర్వకమైన భక్తిని నాపై ఉంచితే మీకు 7 జన్మలు పడుతుంది. 2. వైరమార్గములో వెళ్ళితే 3 జన్మలు పడుతుంది.

31. జయ విజయుల ద్వారా మనకు సందేశము ఏమి?
జ. రజో గుణ, తమో గుణాలు శుద్ధ సత్వ మైన పరమాత్మ దగ్గరకు చేరనీయవు. కావున సత్వగుణాన్ని పెంచుకోవాలి రజో, తమో గుణాలను తగ్గించుకోవాలి.

32. రజో గుణ లక్షణం ఏమిటి?
జ. వారు శాంతిగా ఉండరు. ఇతరులను శాంతిగా ఉంచరు. రజోగుణం వలన కామ క్రోధాదులు ఉత్పన్నం అవుతాయి. దీనితో వారికి ఉన్నవి చాలక ఇంకా ఇంకా కావాలని తిరుగుతూ ఉంటారు.ఉదా - హిరణ్యకశిపుడు, రావణాసురుడు.

33. తమోగుణ లక్షణం ఏమిటి?
జ.తమోగుణ లక్షణం తిని పడుకోవడం, బద్ధకం. ఉదాహరణ- కుంభకర్ణుడు శిశుపాలుడు, దంతవక్త్రుడు.



34.హిరణ్యాక్ష, హిరణ్యకశిపులు ఎవరి పుత్రులు?

జ.కశ్యప ప్రజాపతి మరియు ధితి కుమారులు.

35.విష్ణువు అనగా ఎవరు?

జ.విశ్వనియమ ప్రవర్తకుడైన పరమాత్మ ధర్మములు ధరించి,

విశ్వనియమాలు తప్పితే రక్షించాల్సిన బాధ్యతను కలిగినవాడే
"విష్ణువు ".

36.భగవానుని లక్షణములు ఏవి?
జ.సమగ్రమైన ఐశ్వర్యము, ధర్మము, యశస్సు, శ్రీ, జ్ఞానము, వైరాగ్యములు అనబడే 6 లక్షణములు కలవాడు.

37. వరాహ స్వామి హిరణ్యాక్షుడు ఏవిధముగా సంహరించాడు?
జ. వరాహ స్వామి హిరణ్యాక్షుడిని ఏవిధముగా సంహరించాడు?
జ. ఏ ఆయుధమూ చేపట్టక కేవలం తన అరచేత్తోనే కొట్టగా హిరణ్యాక్షుడు రక్తము కక్కుకొని మరణించాడు.

38.హిందూ మతం అంటే ఏమిటి?
జ. విశ్వజ్ఞానం, విశ్వాతీత జ్ఞానం ఈ రెండింటినీ అందించే సంస్కృతి పేరే హిందూమతం.

39. భగవంతుని ఎలా తెలుసుకోవాలి?
జ. భగవానుడు తాను యజ్ఞ స్వరూపుడై విశ్వాన్ని ఏర్పాటు చేసాడు. నన్ను తెలుసుకోవాలంటే నా స్వరూపమైన "యజ్ఞము" ద్వారా మాత్రమే తెలుసుకోగలరని తెలియచేసాడు.

40. పరమాత్మ యజ్ఞరూపం లోనే ఎందుకు వచ్చాడు?
జ. భూమి తన స్థానంలో తాను ఉండాలన్నా, ఉద్ధరింపబడాలన్నా యజ్ఞము ద్వారానే సాధ్యమని తెలియ చెప్పడానికే స్వామి యజ్ఞరూపములో వచ్చారు.

41.వరహస్వామి తత్త్వము మననం చేయడం వలన కలుగు ప్రయోజనం ఏమి?
జ. యజ్ఞములు చేసే అవకాశము లేని కలికాలంలో యజ్ఞవరాహస్వామితత్త్వాన్ని మననం చేయడం వలన "బహుయజ్ఞములు చేసిన ఫలం లభిస్తుంది.

42. యజ్ఞ స్వరూపము ఎన్ని భాగములతో ఉన్నది?
జ. యజ్ఞము ఒక క్రతువు. అది మంత్రము, దేవత, ద్రవ్యము, క్రతువు, క్రియ అను 5 భాగములతో ఉన్నది.

43. భగవంతుని అవతార లక్షణాలు ఎలా ఉంటాయి?
జ. భగవంతుడు అవతారము దాల్చినపుడు రజో గుణ, తమో గుణ దోషములు ఇసుమంత కూడా లేక నిర్మల "శుద్ధ సత్త్వంతో" అవతరిస్తాడు.

44.భగవంతుని అవతారాన్ని ఎందుకు ఉపాసించాలి?
జ. సత్త్వగుణంతో తరించాల్సిన మనము "శుద్ధసత్త్వమును" ఉపాసించటం వలన మనలోని రజోగుణ, తమోగుణాలు పోయి సత్త్వగుణం పెరిగి, గుణాతీత స్థితికి చేరుతాము కావున భగవంతుని అవతారాన్ని ఉపాసించాలి.

## కపిల మహర్షి చరిత్ర

45. స్వాయంభు మనువు సంతానం ఎవరు?
జ . స్వాయంభు మనువునకు ఇద్దరు పుత్రులు; ఉత్తానపాదుడు మరియు ప్రియవ్రతుడు. ముగ్గురు పుత్రికలు; ఆకూతి, ప్రసూతి మరియు దేవహూతి .

46. ప్రజా సృష్టికిగాను బ్రహ్మ ఎవరిని సృష్టించెను?

జ.ప్రజాపతులను.

47. కర్దమప్రజాపతి ఎక్కడ నుండి జన్మించెను?
జ.బ్రహ్మ దేవుని ఛాయ నుండి.

48. బ్రహ్మ దేవుని సహాయకులు ఎవరు?
జ.ప్రజాపతులు, మనువులు, మహర్షులు.

49. కర్దమ ప్రజాపతి సంస్కారము?
జ.భగవంతునిపై అపార ప్రేమ ప్రాపంచిక విషయములపై వైరాగ్యము.



50. ప్రవృత్తి మార్గము ఏది?
జ. తన బాధ్యత మరువక ధర్మ మార్గమున నడచుట.

51. కర్దముడు ఏన్ని సంవత్సరములు తపస్సు చేసెను?
జ.10,000 సంవత్సరములు తపస్సు.

52. నారాయణుడు ఏరూపమున ప్రత్యక్ష మయ్యేను?
జ. శబ్ధ బ్రహ్మ శరీరముతో, వేద రూపమున.

53. త్రయీవేద్య మనగా ఏమి?
జ.వేదము చెప్పినది దైవము, వేదము కానిది భ్రాంతి.

54. కర్దముడు నారాయణుని ఎట్లు స్తుతించెను?
జ. స్వామి! నిష్క్రియతో కూడిన పరబ్రహ్మ స్వరూపుడవు, మాయకార్యముతో లోక వ్యవహారములు నడుపుతావు అట్టి నీ పాద పద్మములను మేము ఆశ్రయించాము.

55. కర్దముడు నారాయణుని కోరిన కోరిక యేమి?

జ.అల్పులు కోరే అల్పమైన కోరికలు తీర్చు స్వామిని తనకు సత్సంతానం కలిగి సంసారమును విస్తరింప చేయుటకు శక్తిని అనుగ్రహించమని కోరెను.

56. నారాయణుడు కర్దమునిని ఏమని ఆశీర్వదించెను?

జ. ప్రవృత్తి మార్గమున ధర్మ బద్ధముగా సత్సంతానము కలిగి అటుపై నివృత్తి మార్గము అనుసరించిన తానే పుత్రుడునై జన్మింతునని అనుగ్రహించెను.

57. బిందు సరోవరం యొక్క జన్మరహస్యము?

జ. కర్దముని తపస్సుకు చలించి స్వామి అశ్రువులు జారి పడెను. సరస్వతీ నదీ దాని పై నుండి ప్రవహించిన కారణంగా అది బిందు సరస్వతి అని పేరొందినది.

58. స్వాయంభు మనువు ఎవరు?

జ. తొలి చక్రవర్తి.

59. స్వాయంభు మనువునకు ప్రధమతః కర్దముడు ఏమి చెప్పెను.?

జ.సముచితముగా గృహస్థాశ్రమము స్వీకరించి సత్సంతానము కలిగిన పిమ్మట పరమహంస ఆశ్రమము స్వీకరిస్తాను అని చెప్పెను.

60. దేవహూతి భర్తను ఎలా సేవించెను?

జ.తపస్వి అయిన భర్తకు అనుగుణముగా వస్త్రములు ధరించి ఆశ్రమ నియములను అనుసరించి సహకరించెను.

61. వివాహము యొక్క విశిష్టత?

జ. ధర్మ ప్రతిష్ఠ కొరకు.

62.కర్దముడు భార్యకు ఏమి అందించుటకు నిర్ణయించెను?

జ.భార్య కోరుకునే అభీష్ఠ కోర్కెలను కాంక్షలను అందించుటకు నిర్ణయించెను.

63. కర్దముడు తన తపః శక్తితో ఏమి సృజించెను?

జ.తపఃశక్తితో  అద్భుతమైన విమానమును సృజించెను.

64.బిందు సరస్సులో స్నానమాచరించిన తరువాత ఏమి జరిగెను?

జ.వేల కొలది విద్యాధర కన్యలు ఆమెకు సపర్యలు చేసిరి. స్నానం చేత శుద్ధురాలై తపశక్తి చేత పుష్ఠురాలయ్యెను.

65. దేవాహూతి కర్దములకు ఎంత మంది పుత్రికలు జన్మించిరి?

జ.తొమ్మిది మంది.



66. దేవహూతి భర్తను ఏమని ప్రార్థించెను?

జ.జ్ఞానమును ఉపదేశించమని ప్రార్థించెను.

67.కర్మ ధర్మబద్ధం కానిచో వారు దేనితో సమానులు?

జ.మరణించిన వారితో.

68. ధర్మ బద్ధమైన కర్మల వల్ల కలిగేది ఏమిటి?

జ.వైరాగ్యము.

69. దేవహూతికి ఎందు వల్ల వైరాగ్యము కలిగెను?

జ. ధర్మ బద్ధమైన భోగములు అనుభవించుట వలన బ్రహ్మ జ్ఞాని అయిన పురుషునితో సాంగత్యం వలన.

70. కర్దముని కథ ద్వారా తెలిసినది ఏమిటి?

జ. బ్రహ్మ జ్ఞాని సంసారములో ఉన్నా జ్ఞానిగా ఎలా ఉండగలరో తెలియజేస్తుంది.



71. ఎవరికి సన్యాసములేదు?

జ. స్త్రీ కి.

72. నిర్వేదవాదం అనగా ఏమి?

జ. వైరాగ్యం లో ఉండడం.

73. లౌకిక జ్ఞానం ఎందుకు?

జ.అది నిస్సారం అని తెలుసు కొనుటకు.

74. ధృతవ్రతాశి అనగా?

జ.ఒక గృహిణిగా ధర్మములో భోగమును అనుభవించుట.

75. నారాయణ జనన సమయమున దేవహూతి మనః స్థితి ఎలా ఉన్నది?

జ.వైరాగ్యములో కూడి ఉన్నది.

76.పుట్టే సంతానం పై ఏ ప్రభావాలు ఉంటాయి.

జ. కాలము, మనస్థితి, తల్లి తండ్రులు సంస్కారము.

77. కర్దముని ఆశ్రమమునకు విచ్చేసిన దేవతలు కపిలాచార్యుని గురించి ఏమని పలికిరి?

జ. ఇతడే సిద్ధగణములకు గురువు, కపిల మహర్షి, సాంఖ్యాచార్యుడు.

78. కపిల అవతార సారము?

జ.సాంఖ్యతత్త్వము వేద సమ్మతము అని తెలియ చెప్పుట.

79. ధర్మములు ఎన్ని? అవి ఏవి?

జ.ఆరు; వైశేషికం, సాంఖ్య యోగము, న్యాయము , యోగం , పూర్వ మీమాంస, ఉత్తర మీమాంస.

80. సాంఖ్య మనగా?

జ.సంఖ్యలతో చెప్ప బడేది.

81. ఈశ్వర సాంఖ్య మనగా?

జ.ప్రకృతి చేత బంధింప బడిన జీవుడికి ఈశ్వరుని గూర్చి తెలిపేది.

82. ఈశ్వరుడు ఎవరు?

జ.పరమం, ప్రధానం, పురుష రూపములలో వున్న వాడు.

83.త్రివృత్తం అనగా?

జ.మూడు వృత్తములలో లోకాలను నడిపే వాడు. సాత్విక రాజస తామస వృత్తులతో.

84. జీవునికి భగవంతునికి భేధం?

జ. భగవంతుడు స్వతంత్రుడు, జీవుడు పరతంత్రుడు.

85.యోగి ఎవరు?

జ.ఆధ్యాత్మిక సాధనలు  చేయువాడు.

86.మోక్షము ఎవరిది?

జ.ఆత్మనిష్ఠ కలవారిది.

87. ఇంద్రియాలతో తెలుసుకోలేనిది?

జ.అత్యంత సూక్ష్మమైన ఆత్మ జ్ఞానము.

88. ముక్తి ఎవరికి కలుగుతుంది?

జ.సర్వ వ్యాపకమైన బ్రహ్మ అసలు స్వరూపము తెలుసుకున్న వారికి.

89. కపిలుడు ఎందుకు అవతరించెను?

జ. కాలగతిలో క్షీణించిన ఆత్మ జ్ఞానమును తిరిగి ఉద్ధరించుటకు.

90. ఆధ్యాత్మక విద్య అనగా?

జ.ఆత్మ యొక్క అసలు స్వరూపాన్ని తెలియచేయునది.

## జీవజగదేశ్వరం

91.జ్ఞానం ఎవ్వరికి చెప్పాలి?

జ. శరణాగతితో, జిజ్ఞాసతో ప్రశ్నించిన వారికి.

92.కపిలాచార్యుడు తల్లితో (దేవహూతికి) చెప్పిన గీతలో అధ్యాయాలు ఎన్ని?

జ. 8.

93. మోక్షాన్ని పొందటానికి సాధనం ఎమిటి?

జ. ఆధ్యాత్మ నిష్ఠ/ఆత్మ నిష్ఠ.

94. త్రికాల వాదిత మైన సత్యం అన్నిటియందు ఏఏ రూపంలో భాసిస్తూ ఉంటుంది?

జ. సత్త, స్ఫురత్త.


95. బంధానికి, మోక్షానికి కారణం ఎమిటి?

జ. మనస్సు.

96.మనస్సుకున్న లక్షణం ఏమిటి?
జ. సంగం (సంపర్కం).

97.అధ్యాత్మిక సాధనలో ప్రాధమిక సోపానం ఏమిటి?
జ. సత్పురుషుల సాంగత్యం.

98. సత్పురుషుల గుణాలు/లక్షణాలు ఏమిటి?
జ. క్షమా గుణం, సహనం, సర్వప్రాణుల పట్ల ఉపకార బుద్ధి కలవారు, ఎవరిపట్ల శత్రుభావం లేనివారు, శాంతస్వభావులు, చక్కని శీలమే అలంకారంగ ఉన్నవారు, పరమాత్మ పట్ల అనన్యభక్తి కల్గినవారు, ఆయన కోసం కర్మలను విడిచి పెట్టినవారు.



99.ఎలాంటి భక్తి మోక్షం కంటే గొప్పది?
జ. నిష్కామ భగవతారాధన వలన కలిగే చిత్తశుద్ధి, విచారణ, భక్తి.

100.శరణాగతి అంటే ఎమిటి?
జ. భగవంతుడు తప్ప అన్యము లేదనే భావన.

101. ఎలాంటి భక్తి ముక్తికి హేతువు?
జ. ఏకాంత భక్తి/అనన్య భక్తి.

102.సాంఖ్యం అంటే ఎమిటి?
జ. నిత్యానిత్య వస్తు వివేకానికి పనికి వచ్చే విచారణ మార్గం.

103.కపిలాచార్యుడు చెప్పిన గీత సాంఖ్యాన్ని వేటితో సమన్వయం చేస్తుంది?
జ. యోగాన్ని, వేదాంతాన్ని భక్తితో సమన్వయం చేస్తుంది.

104. సమ్యక్ ఖ్యాత మితి సాంఖ్యం అంటే?

జ. పరమాత్మ తత్త్వాన్ని తేటగా, స్పష్టంగా ప్రతిపాదించినది.

105. ప్రకృతికి ఏమని పేరు?

జ. అవ్యక్తమని, ప్రధానమని, నిత్యమని, సదసదాత్మకమని, కార్యకారణాత్మకమని.

106. ప్రకృతి యొక్క ప్రధాన సంఖ్యలు?

జ. 24, 5- పంచభుతాలు; 5- సూక్ష్మతన్మాత్రలు, 10-ఇంద్రియాలు, 4- అంతఃకరణలు.

107. అంతఃకరణలు ఎన్ని రూపాలలో ఉంటుంది, అవేమిటి?

జ. మనస్సు - సంకల్ప వికల్పాలను చేసేది

బుద్ధి - నిశ్చయరూపంలో

అహంకారం - నేను అనే వృత్తి

చిత్తం - స్మృతి రూపంలో ఉండేది.

108. అంతఃకరణాలు ఎలా నిర్మలమవుతాయి?

జ. వాసుదేవుని ఉపాసనలో చిత్తం, అనిరుద్ధ ఉపాసనలో మనస్సు, ప్రద్యుమ్న ఉపాసనలో బుద్ధి, సంకర్షణ ఉపాసనలో అహంకారం నిర్మలమవుతాయి.

109. కాలం అంటే ఏమిటి?

జ. ప్రకృతి లోని 24 వ్యక్తమవడానికి ముందు (మూలప్రకృతియందు), వైషమ్యం కలిగించుటకు పరమాత్మ తన చైతన్యమును ప్రవేశపెట్టాలనే ప్రేరణనే కాలము అంటారు.

110.నిరీశ్వర సాంఖ్యం అంటే?

జ. అన్నిటి యందు భగవంతుని చూడకలిగే వేదాంతం.

111.జీవజగదేశ్వరం అంటే?
జ. చైతన్యము, అందులో వ్యాపించిన కాలం జగత్, దానిని పట్టుకుని వేలాడే వాడు జీవి, ప్రకృతికి చైతన్యం ఇచ్చే వాడు ఈశ్వరుడు.




112. విచారణ అంటే ఏమిటని రమణ మహర్షి చెప్పారు?
జ. జీవుడెవరు, జగత్ ఎమిటి, ఈశ్వరుడు ఎవరు అనేదే.

113. కపిలాచార్యుల వారు ఈశ్వరుడెవరో ఏ ఉదాహరణలతో చెప్పారు?
జ. సూర్య కాంతి, సరస్సు, గోడ.

114.సాధారణ భక్తి, పరా భక్తి తేడా ఏమిటి?
జ. జీవుడు నేననే చైతన్యం వెతికితే వాడే ఈశ్వరుడు – ఇది సాధారణ భక్తి. ఆయనే నేనని తెలుసుకుని పట్టువిడవకుండా ఉండటమే పరా భక్తి.

115. నేననే పరమాత్మ తత్త్వం తెలుసుకోడానికి ఎవరు అవసరం?
జ. నిత్యానిత్య వస్తు వివేకం శాస్త్రం ద్వారా తెలుసుకున్న గురువు అవసరం.

116.కపిలాచార్యులు తెలియజేసిన తత్వం ఎమిటి?
జ.బ్రహ్మవిద్యా తత్త్వం/సాంఖ్యా తత్త్వం.

117.వేదము యొక్క లక్ష్యం ఏమిటి?
జ.పరమాత్మసిద్ధి.

118.సకామ కర్మల ఫలమేమిటి ?

జ.అభీష్టసిద్ధి.

119. నిష్కామ కర్మల ఫలమేమిటి?

జ.చిత్తశుద్ధి, విచారణ, జ్ఞానం, భక్తి.

120.ఆత్మ అంటే ఏమిటి?

జ.నేను అనే చైతన్యానికి ఏది ఆధారమో దానిని ఆత్మ అంటారు.

121. ఏకాంత భక్తి అంటే ఎమిటి?

జ.అభేదభావంతో పరమాత్మను ఉపాసించడమే ఏకాంతభక్తి అని అంటారు.

122. సామ్యస్థితి అంటే ఏమిటి?

జ.అవ్యక్తమైన మూలప్రకృతినే సామ్యస్థితి అంటారు.

## సాధన

123. అష్టాంగ యోగం పరమార్థం ఏమిటి తెలుసుకోవడం ?

జ. భగవంతుడిని.

124. యమ నియమాల ధ్యేయం ఏమిటి?

జ. సత్యం పొందటానికి మనం చేయవలసినవి.

125. 'నేను' అన్న చైతన్యం పరమాత్మది అని తెలుసుకునేందుకు ఏమి చెయ్యాలి?

జ. స్వధర్మాచరణం.

126. విషయ చింత పెరుగుతున్న కొలది ఏది దూరమౌతుంది?

జ. విష్ణు చింతన.

127. దైవా లబ్ధేనా సంతోషః లో దైవం అంటే ఏమిటి?

జ. ప్రారబ్ధం.

128. మనం నిత్య జీవితంలో ఎవరి గురించి చెప్పే వాళ్ళని ఆశ్రయించాలి?

జ. పరమాత్మ గురించి.



129. గ్రామ్య వ్యవహారాలతో ఏమి చెయ్యాలి?

జ. లోక వ్యవహారాలు తగ్గించుకోవాలి.

130. మోక్ష ధర్మాలపై ఏమి ఉండాలి?

జ. ప్రీతి.

131. మూడు భోజన నియమాలు ఏవి?

జ. మిత భుక్, హిత భుక్, ఋత భుక్.

132.మిత భుక్, హిత భుక్, ఋత భుక్, వీటికి అర్ధాలు ఏమిటి?

జ. మితంగా తినటం, హితమైనవి తినటం, ధర్మార్జనతోనే తినటం.

133. ఆది శంకరులు భోజనం గురించి ఏమి అన్నారు?

జ. తినే పదార్థములే కాదు, ఇంద్రియాలతో అనుభవించే అన్ని ప్రాపంచిక విషయాలు ఆహారమే.

134. మితంగా, హితమైనవి, ధర్మార్జనతోనే ఇంద్రియ విషయాలు ఎందుకు అనుభవించాలి?

జ.భగవంతుడిని పొందడానికి.

135. వివిక్త సేవనం అంటే ఎమిటి?

జ. ఏకాంతంలో ఉండి నీగురించి నువ్వు తెలుసుకొనే ప్రయత్నం చేయడం.



136. ఎప్పటివరకు ఏకాంతం అవసరం?

జ. సిద్ధి పొందేవరకు.

137. ఏది ఎక్కువ అయితే స్వయం గురించి ఆలోచన తగ్గుతుంది?

జ. సంఘం.

138. నిత్య జీవితంలో ఏవి తగ్గించుకోవాలి?

జ. లంపటాలు.

139. దేనికి అవరోధం లేకుండా జీవించాలి?

జ. ఆధ్యాత్మిక సాధనకి.

140. అహింస ఎందులో ఉండాలి?

జ. మాటలో, మనస్సులో, చేతలో.

141. ఎప్పుడూ ఏమి పలకాలి?

జ. సత్యం.

142. అస్తేయం అంటే ఏమిటి?

జ. అక్రమార్జన లేక పోవటం.

143. ప్రాపంచిక విషయాలు దేని కోసం మాత్రమే పట్టించుకోవాలి?

జ. దేహ ఆరోగ్యానికి మాత్రమే.



144. గృహస్థులకు బ్రహ్మచర్యం అంటే ఏమిటి?

జ. ఏక పత్నీ వ్రతం, నియమ పాలన.

145. తపస్సు అంటే ఏమిటి?

జ. నియమ పాలన.

146. శౌచం అంటే ఏమిటి?

జ. సదాచారం.

147. శాస్త్ర అధ్యయనం ఎవరి గురించి చెయ్యాలి?

జ. పరమాత్మ గురించి.

148. పురుషార్థనం లో పురుషుడు ఎవరు?

జ. ఈశ్వరుడు, పురుషోత్తముడు.

149.మౌనంగా ఉండటం వల్ల ఏమి అణచబడతాయి?

జ. మనోవికారాలు.

150. సదాసన జయం అంటే ఎలా కూర్చోవాలి?

జ. శాస్త్రాలు చెప్పిన ఆసనంలో కూర్చోవాలి.

151. ప్రాణాయామం అంటే ఏమిటి?

జ. శ్వాస నియంత్రణ.



152. ప్రాణాయామం వల్ల ఏమిటి ప్రయోజనం?

జ. మానసిక ఏకాగ్రత.

153. ప్రత్యాహారం అంటే ఏమిటి?

జ. మనస్సుని ఇంద్రియాల నుంచి వెనక్కి త్రిప్పి హృదయంలో నిలపడం.

154. ధారణ ఏమిటి?

జ.వెనక్కి లాగిన మనసుని నిలబెట్టడం.

155. ధ్యానం ఎలా చెయ్యాలి?

జ. ఒకదాని యందు నిలబెట్టిన మనస్సుని స్థిరంగా కూర్చో బెట్ట గలగాలి.

156. భక్తి లో రెండు రకాలు ఏవి?

జ. సగుణ, నిర్గుణ.

157. సగుణ భక్తిలో మూడు రకాలు ఏవి?

జ. తామస, రాజస, సాత్విక.

158. ఈ మూడింటిలో సమానత్వం (common గా వున్నది) ఏమిటి?

జ. భగవంతుణ్ణి మనకు బిన్నంగా చూడటం.

159.తామస భక్తి పరమార్ధం ఏమిటి?

జ. హింస.



160. రాజస భక్తి పరమార్ధం ఏమిటి?

జ. ఇంద్రియ భోగం, కీర్తి, ఐశ్వర్యం.

161. సాత్త్విక భక్తి పరమార్ధం ఏమిటి?

జ. చిత్త శుద్ధి, ఈశ్వర ప్రీతి, విద్యుక్త ధర్మం.

162.నిర్గుణ భక్తి అంటే ఏమిటి?

జ. నేను పరమాత్మా వేరు కాదు అన్న భావన.

163.నిర్గుణ భక్తిలో విశిష్టత ఏమిటి?

జ. భగవంతుని పట్ల స్వచ్ఛమైన ప్రేమ.

164. నిజమైన భక్తుడు ఎవరు?

జ.సర్వ భూతములలో ఈశ్వరుడినే చూసేవాడు.

165. నిర్గుణ భక్తికి మరో పేరు ఏమిటి?

జ. ఆత్యంతిక భక్తి.

166. నిర్గుణ భక్తి ఫలితం ఏమిటి?

జ. ముక్తి.

167. లోక వ్యవహారాలలో కొట్టుకు పోయేవాళ్ళని ఏమంటారు?

జ. గృహ వ్రతులు.

168. భక్తి యోగ జ్ఞాన యోగాల ద్వారా సత్పురుషులను ఆశ్రయించటం ఎందుకు?

జ. మోక్షం కోసం.

169.సౌచం ఎన్ని విధాలు? అవి ఏవి?

జ.రెండు విధాలు, బాహ్యం, ఆంతరికం.

170. ధ్యానం లో స్థూలాన్ని సూక్ష్మం చేయడం అంటే ఎమిటి?

జ.విష్ణుమూర్తిని ధ్యానిస్తే, మూర్తి పోయి, విష్ణువు మిగిలినట్లు.

171.చైతన్యమహా ప్రభు భగవంతుడిని ఏమని ప్రార్థించాడు?

జ.ధనబలం, జనబలం, కవితా పాండిత్యబలం ఇవి నాకు వద్దు. ఎందుకంటే, ఇవి అహంకారాన్ని పెంచి నీనుంచి దూరం చేస్తాయి. నీపై నెపంలేని భక్తినివ్వు స్వామీ అని ప్రార్థించారు.

172. ఈశావాస మిదం సర్వం అంటే ఎమిటి?

జ.ప్రపంచములోని చైతన్యం పరమేశ్వరుడే అని తెలుసుకోవడం.

# కపిల గీత

173. మాయను దాటటం ఎలా?

జ.అన్నిటియందు భాసిస్తున్న చైతన్యాన్ని, దాని అసలు మూలాన్నీ తెలుసుకోవటం ద్వారా మాయను దాటవచ్చును.

174. కపిల మహర్షిది ఎటువంటి అవతారము?

జ. జ్ఞానవతారం, బ్రహ్మవిద్యని బోధించటానికి అవతరించిన అవతారం.

175. నియతి (కాలం) అనగా ఏమిటి?

జ.ఎప్పుడు ఎక్కడ ఎలా జరగాలో /జరిపించాలో అలా జరగటమే నియతి. భగవత్ శాసన స్వరూపము కాలము.



176.భయం నించి ఎవరు బయటపడతారు?

జ.కాలాతీత భగవంతుడిని పట్టుకున్నవాళ్ళు భయం నించి బయటపడతారు.

177.భాగవతం యొక్క పరమార్థం ఏమిటి?

జ.భగవంతునితో తాదాత్మ్య స్థితి.

178. మందమతులైన మానవులకు దుఃఖానికి హేతువు ఏమిటి?

జ.అనిత్యమైన దేహము, దానితో సంపాదించుకున్న బంధాలు, ఆస్తులూ నిత్యం కావాలనే ఆశే దుఃఖానికి హేతువు.

179. ఏది అజ్ఞానము?

జ.దేహం నేననుకునే భ్రాంతియే అజ్ఞానము.

180.పాపగతి ఎవరికి వస్తుంది?
జ.ధర్మాలు తెలిసికూడా, సంసార లంపటం లో, జీవనం కోసం అధర్మాలు చేసేవారికి పాపగతి తప్పనిసరిగా వస్తుంది.

181. సద్గతి ఎవరు పొందుతారు?
జ.ధర్మబద్ధంగా తమ కర్తవ్యాలు నిర్వహిస్తూ, భగవత్ కార్యాలు చేస్తూ, లంపటత్వాలతోనే సత్కర్మలు ఆచరించేవారు, సద్గతులు పొందుతారు.

182. సద్గతి అనగా ఏమిటి?
జ.కాలపరిమితి గల జీవితం లో, కాల పరిమితిగల సత్కర్మలు చేసి, దానివలన కాల పరిమితి లో గల పుణ్యలోక వాసం చేయటము సద్గతి. పుణ్య ఫల కాలపరిమితి తీరగానే,తిరిగి జన్మనొందుతారు.

183.జీవుడు తిరిగి జన్మను ఎలా పొందుతాడు?
జ.జలము ద్వారా భూమిని చేరి, భూమి ద్వారా ధాన్యపు పప్పు గింజలలో చేరి, దాని ద్వారా తండ్రి శరీరములో ప్రవేశించి, తద్వారా మాతృ గర్భం లోకి చేరుతాడు.

184.లింగ శరీరం అనగా ఏమిటి?
జ.లోకాలు తిరిగే సూక్ష్మ శరీరమే లింగ శరీరం.

185. గతులు ఎన్ని? అవి ఏమిటి?
జ.గతులు మూడు. అవి, పాపగతి, పుణ్య గతి, మిశ్రగతి.

186. అత్యుత్తమమైన జన్మము ఎవరిది?
జ.పరమాత్మ, తానూ అభిన్నము అని తెలుసుకున్నవాడిది అత్యుత్తమమైన జన్మ.

www.gurujnanam.org



187.జీవన్ముక్తి అంటే ఏమిటి?

జ. శరీరం లో ఉండగానే, భగవంతుడిని ఆత్మగా తెలుసుకుని అభేధ స్థితిని పొందినప్పుడు మోక్షము ఇక్కడే లభిస్తుంది. అదే జీవన్ముక్తి.

188. శరణాగతి దేనికి హేతువు?

జ.క్రమముక్తికి హేతువు.

189. కపిల గీత సారాంశము ఏమిటి?

జ.కపిల గీతయే హిందూ ధర్మ సర్వస్వము.

190. సాత్విక భక్తిని ఎలా అలవరుచుకోవాలి?

జ.చిత్త శుద్ధికి, పరమాత్మ ప్రీతికి అనే ఈ రెండింటితో సాత్విక భక్తిని అలవరుచుకోవాలి.

191. త్రిగుణాతీత స్థితి అంటే ఏమిటి?

జ.చిత్తశుద్ధి, ఈశ్వర ప్రీతి అనే కోరిక కూడా లేని స్థితిలో అవిచ్చిన్నముగా తాను పరమాత్మకు అభిన్నుడు అవుతాడు. ఈస్థితిని త్రిగుణాతీత స్థితి లేదా మోక్షం అంటారు.

192.జ్ఞాని, భక్తుడు ఒక్కటే., ఎలా?

జ.జ్ఞాని అయినవాడు త్రిగుణాతీత బ్రహ్మము గురించి మాట్లడితే, భక్తుడు ఆ బ్రహ్మమునే భగవంతుడని ఆశ్రయించి అభిన్నత్వాన్ని పొందుతున్నాడు.

193. కాలం గురించి వివరించండి?

జ.24 లు దాటి 25 వ తత్త్వమే కాలం. కాలము పరమాత్మ స్వరూపమే అయినా ఆయన కాలాతీతుడు. బ్రహ్మ మొదలు పిపీలికాది పర్యంతము కాలానికి లొంగిపోవలసిందే. కాలము గొప్ప శాసన స్వరూపముగా చెప్పబడుచున్నది.

194. భాగవతము తెలియచెప్పే భక్తి గొప్పతనము ఏమిటి?

జ.భాగవతము ఆదర్శముగా చూపించే భక్తి బ్రహ్మ లోకం వరకూ ఉండేవాటిని కాని, చివరకు మోక్షాన్ని కానీ ఆశించదు.

195.బుద్ధి మరియు ఇంద్రియ లక్షణాలు ఏవి?

జ.తెలివితేటలు బుద్ధి యొక్క లక్షణము. సుఖ దుఃఖాలు అను భవించటము ఇంద్రియ లక్షణము. అహం వీటి అన్నిటిలో కలుపుకుని వెళ్ళుతూ  ఉంటుంది.

196. మనిషికి ఏది చూసి వైరాగ్యము కలగాలి?

జ.ఏవి బయట చూస్తే మనకు జుగుప్స కలుగుతుందో అవన్నీ కలిపి పెద్ద మూటగా మన ఈ శరీరము ఉంది . మనిషికి రోత అయిన తన శరీరమును చూసి వైరాగ్యము కలగాలి.

197. అజ్ఞానము ఎప్పుడు తొలుగుతుంది?

జ.దేహాత్మ భావము తొలగి, పరమాత్మ జ్ఞానము తెలుసుకున్నప్పుడు అజ్ఞానము దగ్ధము అవుతుంది.

198. భక్తుడైన గృహస్థు ఎలా ఉంటాడు?

జ.దేవయజ్ఞ, పితుర్యజ్ఞ, ఋషియజ్ఞ, మనుష్యయజ్ఞ, భూతయజ్ఞములను ఏ ప్రయోజనములను ఆశించకుండా భగవత్ ప్రీతిలో భగవంతునే స్మరిస్తూ ఉన్నవాడు భక్తుడైన గృహస్థుడు.

199. దేవ యజ్ఞములు ఎన్ని రకాలు?

జ.నిత్య పూజలు, ప్రతిమనందు, హృదయమందు,మంత్రమునందు, యజ్ఞమునందు,హోమమునందు ఆరాధన చేయటాన్ని దేవయజ్ఞములు అంటారు.

200.మానవునికి బంధాలు ఎన్ని?

జ.మొదటి బంధము - మాతాపితురులు.

రెండవది - భార్యా పుత్రులు.

201. బంధాలతో ఎలా మెలగాలి?

జ.తన శరీరముతో సంపాదించుకున్న మరికొన్ని శరీరాలపై మమకారమును వదలాలి. భగవంతుడిచ్చిన ఇంద్రియ శక్తులను పాఠవము, సత్వసాధన, భగవత్ ప్రాప్తికి వినియోగించుకుని తరించాలి.

202. జీవుడు తిరిగి జన్మను ఎందుకు తీసుకుంటాడు?

జ.కర్మ క్షయం కోసమే.

203. సంస్కారము అనగా ఏమి?

జ.జీవితములో ఉపనయన, వివాహము అను ఏ కొత్త మలుపు తిరిగినా ఆ మాయలో పడకుండా జీవునికి బ్రహ్మమును స్ఫురింపచేయడమే "సంస్కారము" అని అంటారు.

204. సంస్కారములు ఎందుకు చేయాలి?

జ.సంస్కారముల వలన పవిత్రుడై కర్మలు చేయడానికి అర్హత పొంది మరణానంతరము నరకమున పడక కాపాడబడతాడు.

205. కర్మ లోకం అంటే ఏమిటి?


జ.భూలోకము; జీవుడు కొంత పుణ్యం,కొంత పాపం అనుభవించి మిగిలిన కర్మను అనుభవించడానికి భూలోకానికి వస్తాడు . ఇది మిశ్ర లోకం. ఇక్కడ కర్మ అనుభవమే కాకుండా పరమ ఉత్కృష్టమైన జీవన్ముక్తిని పొంది జనన మరణ చక్రము నుండి బయట పడే అవకాశము ఉంది.అందుకే ఈ భూలోకమును కర్మలోకమని అంటారు.

206. జన్మల గొప్పతనం ఎలా ఉంటుంది?

జ.చెట్లు రాళ్ళ జన్మలకంటే పక్షులు జంతువులు, వాటికంటే మానవుల జన్మ. మానవ జన్మలో వేదాధ్యయనము చేయగల జన్మ. దాని అర్థము తెలుసుకోగల జన్మ. అర్థము తెలుసుకుని అనుష్టించే వాడి జన్మ. దీని పరమార్థం పరమాత్మ అని తెలుసుకున్న వాడి జన్మ. తాను పరమాత్మకు అభిన్నుడను అని తెలుసుకున్న జన్మకు మించినది మరియొకటి లేదు.

207. పురాణాలు ఎందుకు పనికి వస్తాయి?

జ.పురాణములలోని కధలద్వారా ఉపాధి అభిమానమును విడిచి పెట్టి వివేక వైరాగ్యములు తెలుసుకుని వాటిని పొంది తరించటానికి.




208.కర్మిష్ఠి ఎవరు?

జ.గృహస్థునిగా ఉండి పంచ యజ్ఞాలు చేసినవాడు.

209. ఉపాసకుడు ఎవరు?

జ.గురువుల ద్వారా భగవతత్త్వాన్ని తెలుసుకుని ప్రీతి గలిగి ఉపాసించేవాడు.

210.ఉపాసకుడు ఏ లోకం చేరుతాడు?

జ.హిరణ్యగర్భ లోకం.

211. హిరణ్యగర్భ లోకం ఎలా ఉంటుంది?

జ.సనక సనందాదులు ఉండు చోటు. అది బ్రహ్మదేవుని లోకము. ఆ లోకములో ఉన్న వారందరూ బ్రహ్మము నందు లయము అవుతారు.

212. బ్రహ్మ లోక ప్రాప్తి ఎప్పుడు వస్తుంది?

జ. ఉపాసనా యోగం లో పాటూ, దేహాత్మ బావం వదిలి ఉండాలి.

213. "నపునరావర్తంతే" అని ఎవరు చెప్పారు?

జ."నపునరావర్తంతే, నపునరావర్తంతే" అని బ్రహ్మసూత్రం రెండు పర్యాయాలు చెప్పింది.

214. ఆది శంకరులు భీష్ముని గురించి ఏమన్నారు?

జ. భీష్ముడు ఉపాసకుడు, మహాయొగి అతను ఏ కాలములో మరణించినా సద్గతే పొందుతాడు. ఆయన ఉత్తరాయణ కాలం గొప్పతనం చెప్పడం కోసము ఆగాడు.

215. హిరణ్య గర్భ లోకానికి ఉపాసకులు ఎందుకు వెడతారు?
జ.దేహాదులు శాశ్వతం కాదనే వైరాగ్యము ఉన్నా నేను భగవంతుని వాడను, భగవంతుడు నావాడు, గొప్ప ఉపాసకుడను అనే అహము ఉన్నందువల్ల.

216. ఉపాసనా భక్తి యోగము అంటే ఏమిటి?
జ.సాత్విక భక్తి నుండి నిర్గుణ భక్తి వైపునకు వెళ్ళటము.

217.ఏ గతులు జీవునికి జన్మను ఇస్తాయి?
జ.పాప పుణ్య మిశ్ర గతులు.

218. గర్భోపనిషత్తు ఏమని తెలియచేసింది?
జ.గర్భములో జరిగేది ఎవ్వరికి గుర్తు లేకపోయినా, గర్భం నుంచి వచ్చామనే సత్యాన్ని ఎలా గుర్తు పెట్టుకున్నామో. గత జన్మలు నీకు గుర్తు లేకపోయినా అవి దాటి వచ్చామనే సత్యాన్ని గుర్తించి ఈ జన్మను సార్ధకము చేసుకోవాలి.

219.జీవన్ముక్తుని స్తితి ఎలా ఉంటుంది?
జ.ఉర్వారుక మివ బందనాత్ ... తొడిమ లోని దోస పండులా, పండు తొడిమతోనే ఉంటుందికాని, అంటుకోకుండా ఉంటుంది.

## కపిల గీత జ్ఞానం - ధృవుడు తపస్సుకి మధువనం చేరుకొనుట

220. మనము భగవంతుడిని ఎలా ధ్యానిస్తూ ఉండాలి?
జ.ఆ భగవంతుడు ఇక్కడే మనలోనే ఉన్నాడని ఆత్మ అభేదంతో పూజించాలి.

221. జీవన్ముక్తులు అయిన వారు భగవంతుడిని ఎలా ఆస్వాదిస్తూ వుంటారు?
జ. జీవన్ముక్తులు అయిన వారు నిరంతరం బ్రహ్మానుభవం పొందుతూ, నిత్యం ఆ బ్రహ్మం దాల్చినటువంటి దివ్య నామ దివ్య రూపాలని, లీలలని కూడా ఆస్వాదిస్తూ వుంటారు.

222.నిజమైన భక్తి అంటే ఎలా ఉండాలి?
జ. నిజమైన భక్తి సత్యమై ఉండాలి, ఈ ప్రపంచం మీద కించిత్ లంపటం లేకుండా ఉండాలి. అటువంటి భక్తికి, బ్రహ్మ జ్ఞానానికి ఎటువంటి భేదం లేదు.

223. మన్నిష్ట, నైర్గుణయో భక్తి లక్షణః" అంటే ఏమిటి?
జ. మన్నిష్టఅంటే, పరమాత్మయందే స్థిర పడిపోయిన జ్ఞాన యోగము. నైర్గుణయో భక్తి లక్షణః. అంటే, నిర్గుణ భక్తి లక్షణం.

224. శాస్త్రాల్లో బ్రహ్మం గురించి రకరకాలుగా ఎందుకు చెప్పారు?
జ. మనకి బ్రహ్మం గురించి సరైన అవగాహన అందలేదు, మన బుద్ధి రకరకాలుగా ఉంటుంది కనుక, ఆ రకరకాలైన బుద్ధులకి, బ్రహ్మం గురించి అందించడానికి రకరకాలు గా చెప్పారు.

225.ఒక్కొక్క శాస్త్రంఒక్కొక్కటి చెప్తున్నప్పుడు, శాస్త్రములు అన్నీ గొప్పవైనప్పుడు, భగవంతుని యొక్క అసలు స్వరూపం ఏమిటి?
జ. భిన్న భిన్న శాస్త్రాల్లో ఆ పరమాత్మ యొక్క భిన్న భిన్న స్వరూపాలు గ్రహించి, అవన్నీ ఒకే భగవంతుడివని తెలుసుకోవాలి.



226. కపిలుడు తన తల్లికి చివరగా ఏమని ఉపదేశించాడు?
జ. నిరంతరం నా నామ సంస్మరణ చేస్తూ, నాపై, అచంచలమైన భక్తి కలిగి ప్రేమగా నన్ను ధ్యానిస్తూ ఉండు అని ఉపదేశించాడు.

227. బ్రహ్మవిద్య ఎవరికి అందించరాదు?

జ. దుష్టులు, వినయం లేని వారు, దురాచార పరులు, అశాస్త్రీయ వాదులు, డాంభికాలు చెప్పే వారు,ఇంద్రియ భోగాలపై, ఈ ప్రాపంచిక విషయాల పై లంపటం గల వారు, అలాగే, భక్తులు కానివారు. భక్తులని ద్వేషించే వాళ్ళకి కూడా ఉపదేశించరాదు.

228. బ్రహ్మవిద్యకి అర్హులెవరు?
జ. సమస్త ప్రాణులయందు ప్రేమ, గురుసేవపై అభిరుచి, బాహ్యవిషయాలపై వైరాగ్యము మనసుకు ప్రసన్నత ఉన్నవాడు.

229.ఆద్యాత్మిక ప్రయాణంలో దేనిని పట్టుకోవాలి? దేనిని వదలాలి?
జ. పరమాత్మ ని పట్టకోవాలి ప్రపంచాన్ని వదులుకోవాలి!

230. భగవంతుణ్ణి ఎలా కొలవాలి?
జ. నిరంతరం ఆ భగవంతుని గురించే ఆలోచిస్తూ దేహ స్పృహ ఉన్నంత సేపూ, అయన పనులే చేస్తూ, ఎప్పుడైనా ఈ ప్రపంచం వైపు బుద్ధి మరలితే అది నిస్సారము అని మనకి మనం చెప్పుకుని తిరిగి ఆయన వైపుకి అనగా వెనక్కి (ప్రత్యక్) తిరగాలి.

231.జీవన్ముక్తులు ఎలా వుంటారు?
జ. జీవన్ముక్తులు గంగ లో పెట్టిన కడవ లాగా ఉంటారుసరస్సులో ఉన్న ఏనుగు తన చుట్టూ తగలబడి పోతున్న అరణ్యాన్ని సాక్షి గా ఎలా చూస్తుందో, బ్రహ్మ జ్ఞాని అయిన జీవన్ముక్తుడు తాను బ్రహ్మము నందు నిలబడి, సంసార కర్మలలో తపిస్తున్న ప్రపంచాన్ని అలా చూస్తూ ఉంటాడు.

232.జీవన్ముక్తులకు ఎవరిని ఉదాహరణ గా చెప్పుకోవచ్చు?
జ. శుక మహా ముని, చైతన్యమహా ప్రభులను ఉదాహరణ గా చెప్పుకోవచ్చు.

233.దేవహూతి తన దేహాన్ని విడిచి పెట్టినతరువాత ఏమైంది?
జ. ఆమె శరీరం, ఈశ్వరుని ప్రభావంతో ఒక పుణ్య నదిగా మారి, ఇప్పటికీ బిందు సరోవరం పక్కనే సరస్వతి నదిగా ప్రవహిస్తూ ఉంది.


మాతృ గయా బిందుసరోవర్ సిద్పూర్, మెహసానా , గుజరాత్, ఇండియా

234. బిందుసరోవరం అంటే ఏమిటి?
జ. పరమ భక్తుడైన కర్దముని భక్తికి విష్ణువు రాల్చిన ఆనందాశ్రువుల వలన ఏర్పడిన సరస్సు.

235. బిందు సరస్సు, మాతృగయ ఇప్పుడు ఎక్కడ ఉన్నాయి?
జ. గుజరత్ లో, అహ్మదాబాద్ సమీపములో మెహసాన (Mehsana) లో ఉన్నది.

236. మాతృగయ ప్రాధాన్యత ఎమిటి?
జ. మాతృకర్మలు మాతృగయలో చేసినచో సద్గతులు లభిస్తాయి. ఈ ప్రదేశములో మాతృకర్మలు మాత్రమే చేస్తారు.

237. పితృగయ ప్రాధాన్యత ఏమిటి?
జ. ఇక్కడ పితృకర్మలు, మాతృకర్మలు కూడా జరిపిస్తారు.

238.సిద్ధాశ్రమం అని ఏ ప్రాంతాన్ని అంటారు? దానికి మరో పేరు ఏమిటి?
జ. కర్దమ ప్రజాపతి తపస్సు చేసిన, కపిలాచార్యుడు ఆవిర్భవించిన, దేవహుతి కపిలాచార్యుని వల్ల బ్రహ్మ జ్ఞాన ఉపదేశం, సిద్ధి పొందిన స్థలం సిద్ధాశ్రమంగా ప్రఖ్యాతి పొందింది. దీన్నే మాతృగయ అని కూడా అంటారు.

239.కపిలోపాఖ్యానం కథ నుంచి మనము నేర్చుకున్న జ్ఞానం ఏమిటి?
జ. సత్కర్మలు చేసినా, సంతానం వలన సద్గతులు పొందగలము కానీ, మోక్షాన్ని పొందలేము.

240. ఉత్తమగృహస్థు ధర్మాలు ఎవరిద్వారా తెలియజేయబడ్డాయి?
జ. కపిలోపాఖ్యానములో కర్దమప్రజాపతి, దేవహుతి ద్వారా.

241. ఉత్తానపాదుడు ఎవరి కొడుకు?
జ. ఉత్తానపాదుడు స్వాయంభువ మనువు కొడుకు.

242. ఉత్తానపాదుడి భార్యలు ఎవరు? వారి సంతానము ఎవరు?
జ. ఉత్తానపాదుడి భార్యలు సునీతి, సురుచి. సురుచి కుమారుడు ఉత్తముడు, సునీతి పుత్రుడు ధృవుడు.



243. ధృవుడిని తన తండ్రి ఒడిలో కూర్చోకనివ్వకుండా, సురుచి అతనితో ఏమంది?
జ. నువ్వు నాకు పుట్టే యోగం లేకపోవడం వల్లే నీకు తండ్రి వడిలో కూర్చునే అర్హత లేదు.
నీవు తపస్సు చేస్తే, నా కడుపులో పుట్టే యోగం వస్తుంది అని చెప్పింది.

244.ధృవుడికి తన తల్లి, తపస్సు గురించి ఏమని వివరించింది?
జ. ధర్మార్ధానికి, పురుషార్ధానికి మూలము భగవంతుడే, ధర్మార్ధ కామములు కావాలన్నా, మోక్షం కావాలన్నా ఆ భగవంతుణ్ణే తలుస్తూ తపస్సు చెయ్యాలి.

245. తపస్సు అంటే ఏమిటి?
జ. తపస్సు అంటే, సత్కర్మలని భగవదార్పణలో ఆచరించడమే! భగవంతుని ఆరాధనే తపస్సు.

246. భగవంతుణ్ణి పట్టుకోవాలనే లక్ష్యం ఉన్న వాళ్ళని ఆయన ఎలా అనుగ్రహిస్తాడు?
జ. మార్గం చూపించడానికి ఒక గురువుని ఆ భగవంతుడే పంపిస్తాడు.

247. తపస్సు చెయ్యాలనే సంకల్పంతో బయలు దేరిన ధృవుడికి ఎవరు ఎదురయ్యారు?
జ. నారద మహర్షి ఎదురయ్యాడు.



248. నారదుడు ధృవునికి ఏమని నచ్చచెప్పాలని ప్రయత్నించాడు?
జ. నారదుడు, ఆ బాలునితో, మానావమానాలు వస్తూ పోతూ ఉంటాయి, వాటిగురించి చింతించ కూడదు. ఆ రెంటినీ సమానం గా భావించాలి, నీకు తప్పకుండా మంచి రోజులు రావచ్చు, రాజాధికారం రావచ్చు, తండ్రి ఆదరణ లభించవచ్చు కనుక తపస్సు గురించి ఆలోచించ కుండా తిరిగి రాజ్యానికి వెళ్ళు అని నచ్చచెప్పడానికి ప్రయత్నించాడు.

249.ధృవుడు నారదునితో తన స్థితిగురించి చెప్తూ తన కోరిక ఏమని చెప్పాడు?
జ. ధృవుడు, తన వయస్సుకి, తాను వున్న ప్రస్తుత స్థితికి, మానావమానాలు సమానం గా చూసే స్థితి అర్థం కాదు, కనుక తనకి ఆ నారాయణుని గురించి తపస్సు చేయడం ఒక్కటే మార్గం అని అన్నాడు. అంతేకాక, తాను క్షత్రియుడిని, నాకు పౌరుషం వుంది, నాకు ఉక్కటే కోరిక, అందేమిటంటే, మా నాన్నగారు, తాతగారు కూడా పొందలేని ఉత్తమ స్థితిని నేను పొందాలి, అప్పుడే, నా పౌరుషం తృప్తి చెందుతుంది అన్నాడు.

250. నారదుడు ధృవుని కోర్కె విని ఏమన్నాడు?
జ. ఎటువంటి స్థితి అయినా, విష్ణువుని ఆశ్రయిస్తే వస్తుంది. కనుక నువ్వు కోరుకున్నట్లు నీ తండ్రి,తాత కూడా పొందలేనటువంటి ఉన్నత స్థితి నీకు రావాలి. దానికి నువ్వు ఆ విష్ణువుని ఆశ్రయించాలి. దానికి నీకు ఒక దివ్య మంత్రాన్ని ఉపదేశిస్తాను,ఆ మంత్రం ఎటువంటి స్వామి గురించో కూడా చెప్తాను అన్నాడు.

251.మంత్రోపదేశం పొందినవాళ్లు ఎలా జపించాలి?
జ. మంత్రంతో పాటు జపం చెయ్యాలి, ఆ మంత్రం తో పూజించాలి, యజ్ఞం చెయ్యాలి.

252. యజ్ఞం ఎన్ని రకాలు?
జ. యజ్ఞం అన్నది 4 రకాలు గా చెయ్యాలి:
1. ద్రవ్య యజ్ఞం 2. కాయిక యజ్ఞం 3. వాచక యజ్ఞం 4. మానసిక యజ్ఞం.

253.నారదుడు ధృవుడికి ఏ మంత్రం ఉపదేశించాడు?
జ. నారదుడు ధృవుడికి వాసుదేవ మంత్రం "ఓం నమో భగవతే వాసుదేవాయ" అని ఉపదేశించాడు.

254. నారదులవారు ధ్యానం ఎలా చెప్పారు?
జ. ఆ పరమాత్మ మనపట్ల ప్రసన్నుడై మనల్నే చూస్తున్నాడని తలచి ధ్యానించాలి.

255. నారదుడు ధృవుడికి నారాయణుని ఎలా తపస్సుచేయమని ఉపదేశించాడు?
జ. నారాయణుడు నాలోనే వున్నాడు అనుకున్నట్లుగా ఆయన్నే ధ్యానిస్తూ అనురాగం తో ఆయన్నే చూస్తూ, నియమంగా జపం చెయ్యి, ధ్యానం చెయ్యి అని ధృవునికి ఉపదేశించాడు.

256. నారదుడు ధృవుని ఏ ప్రదేశములో తపస్సు చేయమన్నాడు?
జ. మధువనంలో, ఆ నారాయణుడు ఎప్పుడు తిరుగుతూ ఉంటాడు, ఆ మధువనం లో తపస్సు చేసుకో అని ఉపదేశించాడు.

257.కపిలోపాఖ్యానం లోనూ, ధృవ చరిత్ర లోనూ మనం తెలుసుకోవలసినది ఏమిటి?
జ. మనమున్న స్థితి ఏమిటో గ్రహించి, ఆయననే ఏకాగ్రత తో ధ్యానిస్తూ కొలిస్తే, అదే మనని ఆయన దగ్గరకి చేరుస్తుంది.

## ధృవోపాఖ్యానం



258. ధృవుడి ప్రేరక  గురువు ఎవరు ?
జ. కన్నతల్లి సునీతి.

259.ధృవుడి   బోధక గురువు ఎవరు?
జ. నారదుల వారు.

gurujnanam.org

260. నారదులవారు ధృవునికి బోధించినది ఏమిటి?
జ. సమబుద్ధి కలిగివుండు, నిగ్రహం అవలంబించు, మాన అవమానాలు ద్వందాలు, తపస్సు కఠినము అని చెప్పారు.

261. నారదుల వారు ధృవునికి బోధించిన మంత్రము ఏమిటి? ఎన్ని అక్షరములు?
జ. వాసుదేవ మంత్రము, ద్వాదశాక్షరి.

262.తల్లి మాటలకు ధ్రువుడు వెంటనే స్పందించడానికి కారణం?
జ.పూర్వపుణ్య విశేషం.

263. ధృవునికి ఉన్న ముఖ్యమైన లక్షణము ఏమిటి?
జ. ఏది చెప్పినా పట్టుకొనే లక్షణం వుంది ధృవునికి.



264.మంత్రము అంటే ఏమిటి?
జ. భగవానుని శబ్ద రూపమే మంత్రము.

265.భగంతుడు సంచరించే తీర్ధ స్థలాలు ఏవి?
జ. గంగ, యమునా, సరస్వతి నది ప్రాంతాలు.

266.నారదుడు ధృవునికి ఎక్కడికివెళ్ళి తపస్సు చెయ్యమన్నారు?
జ. బృందావనంలో ఉన్న మధువనం లో.

267.ప్రసాదము అంటే ఏమిటి?
జ. పదార్థం భగవంతునికి నివేదన చేస్తే ప్రసాదం అవుతుంది. భగవానుని అనుగ్రహ శక్తికే ప్రసాదం అని పేరు.

268. పూజ ఎలా చెయ్యాలి అన్న సందర్భములో గురువుగారు చెప్పిన భక్తులు ఎవరు?
జ. త్యాగయ్య - మనం విష్ణు స్వామికి ఇష్టమైన తులసి దళాలను ప్రేమతో పూజ చెయ్యాలి అన్నారు.

269.భగవంతుని ఆరాధన గురించి చెప్తూ, చెప్పిన భక్తుల పేర్లు ఏమిటి?
జ. నారాయణ భట్టాచార్యులు, శంకర భగవత్పాదులు.

270. శ్రవణం వలన ప్రయోజనం ఏమిటి?
జ. మానసిక ఉపచారము శ్రవణకాలంలో జరుగుతుంది.

271. మంత్రమూర్తి అంటే అర్థం?
జ. వేదం యొక్క శబ్దరూపం మంత్రం, ఆ శబ్దంతో ఏ తేజస్సు ఉత్పన్నమౌతుందో, అదే దేవతారూపం. మంత్రహృదయంతో మంత్రమూర్తిని ప్రార్థించాలి.

272.ధ్యానం అంటే ఏమిటి?
జ. బుద్ధిలో భగంతుడి రూపాన్ని స్మరించడం.

273.జీవన్ముక్తి అంటే ఏమిటి?
జ. అంతటా భగంతుడినే చూస్తూ, అన్ని భగవంతుడే అనే భావనతో, భగంతుడే జీవితం అని భావించడం.

274. ధృవుని తండ్రి పేరు?
జ. ఉత్తానపాదుడు.

275.మోహం ఎటువంటిది అని చెప్పారు?
జ. మోహం చాలా చెడ్డది. ధర్మం చెయ్యనివ్వదు.

276.ముక్తి ఎవరికి లభిస్తుంది?

జ. భక్తి తో, వైరాగ్యముతో, నిరంతర భావనతో భగవతోపాసన చేసినవారికి.

277. సదోపవాసి అంటే ఎవరు అని భిష్ముడు చెప్పేరు?

జ. భగవత్ నివేదిత ఆహారాన్ని మితముగా రెండు పూటలా భుజించడం.

278. ఉపాసకులు ఏ యోగంలోకి వస్తారు?

జ. ఉపాసకులు సకామంతో చేస్తారు, ఉపాసన కర్మయోగంలోకి వస్తుంది. ఉపాసన కంటే గొప్పది భక్తి.

279. సాధకుని లక్షణాలు ఏమిటి?

జ. సాత్విక సాధన, తాత్విక చింతన.

280.విష్ణుమూర్తి శంఖం పేరు ఏమిటి?

జ. పాంచజన్యము.

281.పాంచజన్య శంఖం ఎలా వుంది?

జ. తెల్లని రంగులో, వెయ్యి చంద్రకాంతులలో శంఖం ఉంది.



## ధృవ చరిత్ర (తపస్సు, విష్ణుసాక్షాత్కారం,ధృవుడి రాజ్యపాలన, అంత్యమున పరమపదము )

282.ద్వాదశ ఆదిత్యులు ఇచ్చే ప్రకాశం ఏమిటి?

జ. బ్రహ్మజ్ఞానం.

283. ధృవుడికి మనకి తేడా ఏమిటి?

జ. మన చేత మాటలు పలికించేవాడు భగవంతుడు అని స్పృహ వున్నవాడు ధృవుడు, ఆ స్పృహ లేని వాళ్ళం మనం.

284. స్వధామ్నా అంటే ఏమిటి?

జ. స్వయం ప్రకాశంతో వుండి, చేతనత్వానికి చైతన్యం ఇచ్చే వాడు.

285.భగవంతుడిని ఏమి కోరుకోవాలి?

జ. భగవత్ అనుగ్రహాన్ని గుర్తించే బుద్ధి అడగాలి.

286. చైతన్యాన్ని ఎలా తెలుసుకోగలం?

జ. ఇంద్రియ చేతన ద్వారా.



287. అంతర్ముఖం అంటే ఏమిటి?

జ. ఎందునుంచి వచ్చామో అందులోకి తిరిగి చూడడం.

288. శరీరాన్ని ఏ విషయాలకి వినియోగించాలి

జ. యోగానికి.

289. ప్రత్యక్, పరాక్ అనగా ఏమిటి?

జ. ప్రత్యక్ అంటే అంతర్ముఖత్వం, పరాక్ అంటే బహిర్ముఖత్వం.

290. లీలా శుకులు ఎవరు?

జ. కృష్ణ భక్తుడు, ఉపనిషత్ సారం తెలిసిన వారు.

291. బ్రహ్మమే ప్రధానం, జీవన్ముక్తి గొప్పది అని తెలుసుకొని - అవి పొందేది ఎవరు

జ. పూర్వ జన్మ వాసనలు, సంస్కారాలు వున్నవాళ్లు.

292. మోక్షం అంటే ఏమిటి?

జ. వాసనా క్షయం, శాస్త్ర జ్ఞానం లభించటం మాత్రమే కాదు.

293.శాస్త్ర జ్ఞానం ద్వారా అర్థం అయ్యే మోక్షాన్ని ఏమంటారు?
జ. పరోక్ష జ్ఞానం.

294. అపరోక్ష జ్ఞానం అంటే ఏమిటి?
జ. శాస్త్ర జ్ఞానం ద్వారా మోక్షం అర్థం అయ్యి ఆ మోక్షం అనుభవానికి రావడం.

295.విష్ణుపురాణం లో ధృవుడి గత జన్మల గురించి ఏమని వివరించారు?
జ. ధృవుడు పూర్వ జన్మలో క్షత్రియ స్నేహితుడితో కలిసి తిరుగుతూ రాజ భోగాలు కోరుకున్న ఒక వేదవేత్త.

296. ధృవుడు ఎవరి మనవడు?
జ.స్వాయంభు మనువు చక్రవర్తి యొక్క మనవడు.



297.సుఖ, దుఃఖాలు దేనివల్ల క్షయం అవుతాయి?
జ.అనుభవము లో మాత్రమే.

298. ధృవుడు అధిష్టించిన పదవి ఏది?
జ. ధృవమండల అధిపతి (ఇది విష్ణు వైకుంఠాలలో ఒకటి).

299.ధృవుడు ఎన్ని సంవత్సరాలు భూమిని పాలించాడు?
జ. 36,000 సంవత్సరాలు (స్వాయంభు మన్వంతర కృతయుగం).

300. ధృవం అంటే ఏమిటి?
జ. అంతరిక్షంలో సమస్త గ్రహాదులు, తారలు దేనిని ఆధారంగా తిరుగుతాయో అది ధృవం.

301. విష్ణువు వరం ఇచ్చి అంతర్ధానం అయ్యాక ధృవుడు ప్రీతిగా ఎందుకు లేడు?

జ. ధృవమండలం బ్రహ్మం కంటే గొప్పది కాదు అని తెలుసుకొన్నాడు, పరమాత్మ సాక్షాత్కరించాక అల్పమైన పదవి అడిగినందుకు.

302. ధృవ, బ్రహ్మ, స్వర్గ లోకాల పదవులకంటే గొప్పది ఏది?
జ. భక్త పదవి (భగవద్భక్తి - భగవంతుడి తప్ప అన్యం పట్టని ప్రీతి భావం).

303. ధృవుని కథ ప్రయోజనం ఏమిటి?
జ. లోకేశ్వరుని పాదం మనం పట్టుకుంటే, లోకం మన పాదం పట్టుకుంటుంది అని గ్రహించడం.

304. ధృవ మండల విశిష్టత ఏమిటి?
జ. ధృవమండలం ఒక సాలోక్య ముక్తి. ధృవమండల అధిపతి కాలచక్రానికి అధిపతి. తిరిగే కాలాన్ని చూస్తూ ఉండాలంటే వాడు తిరగకుండా ఉండాలి.

305. ఉత్తముడు (ధృవుడి తమ్ముడు) ఎవరితో, ఎక్కడ గొడవపడ్డాడు?
జ. హిమాలయాల్లో అల్కాపురిలో యక్షులతో యుద్ధంలో మరణిస్తాడు.

306. యక్షుల తరపున, ధృవుడితో యుద్ధానికి వచ్చింది ఎవరు?
జ. కుబేరుడు (యక్షాధిపతి).

307. కుబేరునితో యుద్ధం చేయబోయిన ధృవుడిని ఆపింది ఎవరు?
జ: స్వాయంభు మనువు.

308. స్వాయంభు మనువు ధృవుడికి చేసిన తత్త్వ బోధ ఏమిటి?
జ: తొందరపాటు పడకూడదు, క్షత్రియోచిత ధర్మంతో భాగవత ధర్మం కలవాలి. ప్రతీకార యుద్ధం లో ధర్మ రక్షణ ఉండదు.

309. కుబేరుడు సంతోషంతో వరం ఇచ్చినప్పుడు ధృవుడు ఏమి కోరుకున్నాడు?
జ. నాకు విష్ణువుయందు క్షణంలో అరభాగం కూడా మరిచిపోని బుద్ధి ఇవ్వు అని కోరుకున్నాడు.

310.అంత్యకాలంలో విష్ణుధూతలు వచ్చినప్పుడు ధృవుడు ఏమి అడిగాడు?
జ. తనకి విష్ణుభక్తి ప్రేరేపించిన తల్లి (సునీతి) కి లేని గతి తనకొద్దన్నాడు. దానికి వారు సంతోషించి దేవయాన మార్గంలో హిరణ్యగర్భ లోకాలకు ప్రయాణిస్తున్న తల్లిని చూపించారు.

311.ధృవుడు ఈ లోకాన్ని ఎలా వదిలాడు?
జ. అంత్యకాలం లో వచ్చిన మృత్యుదేవత యొక్క వంచిన తల మీద కాలు మోపి విమానం ఎక్కాడు (కాలాతీత స్థితికి వెళ్ళాడు అని అర్ధం).

312.ధృవచరిత్ర ఏఏ రోజుల్లో పఠిస్తే శుభప్రదం?
జ. పూర్ణిమ, అమావాస్య, ద్వాదశి, శ్రవణా నక్షత్రంరోజు, సంక్రాంతి, రధసప్తమి.

313. భక్తికి ఉండవలసిన లక్షణం ఏమిటి?
జ. ధృవం (శాశ్వతం, నిశ్చితం దృఢం).

## అంగరాజు రాజ్యము విడిచి వెళ్ళుట మరియు వేనరాజు మరణించడం, పృధూపాఖ్యానం.

314.ధృవుడి పుత్రుల పేర్లు ఏమిటి?
జ. ఉత్కళుడు, వత్సలుడు.

315. ఉత్కళుడు అంటే అర్ధం ఏమిటి?
జ. కాలమునకు అతీతుడగు బ్రహ్మజ్ఞాని.

316.  ఉత్కళుడుకి రాజ్యకాంక్ష లేకపోవటానికి కారణం ఏమిటి?
జ. ఆయన మనోవృత్తి ప్రవాహమంతా కూడా జగత్తు నుంచి మరలి నివృత్తి మార్గము పొందిన కారణం చేత .

317. మంత్రులు,పెద్దలు అందరు కలిసి ఎవరిని రాజుని చేశారు?
జ. భ్రమి పుత్రుడైన వత్సరుడిని.

318. కాలచక్రాధిష్టాత ఎవరు?
జ. ధృవుడు.

319.  భ్రమి అంటే అర్ధం ఏమిటి?
జ. కాలచక్రము యొక్క భ్రమణము భ్రమి.

320.వత్సరుడు అంటే అర్ధం ఏమిటి?
జ. సంవత్సర అధిష్టాత.

321.వత్సరుడు భార్య సర్వర్థి.  సర్వర్థి అంటే అర్ధం ఏమిటి?
జ.సూర్యుడి మార్గము.

322. వత్సరుడు, సర్వర్థి యొక్క పుత్రులు ఎవరు?
జ.పుష్పార్ణుడు, తిగ్మకేతువు, ఊర్జుడు, ఇషుడు, వసువు, జయుడు (వీరు ఋతువులకి అధిష్టాన దేవతలు).

323. పుష్పార్ణుడి భార్యలు ఎవరు?
జ. ప్రభ, దోష (పగలు,రాత్రి అనే కాలానికి అభిమాన దేవతలు).

324.ప్రభ యొక్క పుత్రులు ఎవరు?

జ. ప్రాతః మాధ్యందిన సాయము. (కాలాభిమాన దేవతలు).

325. దోష యొక్క పుత్రులు ఎవరు?

జ. ప్రదోషుడు, నిషీధుడు, వ్యుష్టుడు (రాత్రి ఆరంభ దశ, మధ్య రాత్రి, సూర్యోదయం అయ్యే దశ.

326. వ్యుష్టుడి భార్య ఎవరు?

జ. పుష్కరిణి (సుర్యోదయానికి ముందు ఉన్న వికసన దశ).

327. వ్యుష్టుడు, పుష్కరిణిల యొక్క సంతానం ఎవరు?

జ. సర్వతేజసుడు.

328.సర్వతేజసుడు భార్య ఎవరు?

జ. ఆకూతి.

329.సర్వతేజసుడు, ఆకూతి పుత్రుడు ఎవరు?

జ. చాక్షుష మనువు.

330. అంగుడు ఎవరి సంతానము?

జ. ఉల్ముకుడు, పుష్కరిణి కి కలిగిన సంతానం.

331. అంగుడికి కలిగిన పుత్రుడు వేనుడు ఎలాంటివాడు?

జ. దుష్టుడు హింసాపరాయణుడు, దయ లేనివాడు.

332.వేనుడు మారడు అనుకోని అంగుడు ఏమి చేశాడు?

జ. వైరాగ్యంతో వానప్రస్థానికి వెళ్ళిపోయాడు.

333. అంగుడి తర్వాత ఎవరు రాజయ్యారు?


జ. దుష్టుడు అని తెలిసినా వేనుని రాజుని చేశారు.

334.వేనుడు రాజైన తర్వాత ఎలావుండేవాడు?

జ.ఎవరిమాట వినకుండా స్వేచ్ఛగా ప్రవర్తించేవాడు.

335.వేనుని అవినీతికి రాజ్యం ఎలా వున్నది?

జ. అధికారులు కూడా అవినీతి పరులు అయ్యారు. ప్రజల్లో భయం ఏర్పడింది.



336. పెద్దలందరూ కలిసి వేనునికి ఎలా నచ్చ చెప్పారు?

జ. రాజ్య క్షేమం కోసం మనం చేసే కర్మలన్నీ కూడా భగవదర్పణ బుద్ధితో చేయాలి.

337. పెద్దలు చెప్పిన మాట వినగానే వేనుడు ఏమన్నాడు?

జ. నేనే విష్ణువు అని అనుకోండి. యజ్ఞాల్లో హవిస్సులు విష్ణువుకి ఇచ్చే బదులు అవన్నీ నాకివ్వండి.

338.వేనుని ప్రవర్తన చూసి లాభం లేదు అని మంత్రులు పెద్దవాళ్ళు కలిసి ఏమిచేశారు?

జ. వేనుని హతమార్చారు.

339.వేనుడు మృత శరీరాన్ని అతని తల్లి సునీథ ఏమిచేసింది?

జ. తన మంత్ర, యోగ శక్తులతో శరీరాన్ని భద్రపరిచినది.

340. వేనుని హతమార్చిన తర్వాత ఏమి జరిగినది?

జ. పాలకుడులేడు. అరాచకత్వం వచ్చింది.

341.మంత్రులు అందరు కలిసి వేనుని తల్లిని ఏమి కోరారు?

జ. వేనుని శరీరము వాళ్ళకి ఇవ్వమని కోరారు.

342. వేనుని శరీరాన్ని వైజ్ఞానికులు ఏమి చేశారు?

జ. శరీరాన్ని మధనం చేయడం మొదలు పెట్టారు.

343. మొదటిగా ఏ భాగాన్ని మధనం చేశారు? ఏమి వచ్చింది?

జ. ఊరువులను. పాపసంస్కారాల వల్ల కలిగిన లక్షణముతో ఒక నల్లని పురుషుడి రూపంతో బయటికొచ్చాడు.

344. రెండవ సారి ఏ భాగం మధనం చేశారు?

జ. అతడి బాహువులు.

345. వేనుని బాహువుల నుండి ఎవరు వచ్చారు?
జ. విష్ణు తేజస్సుతో ఒక స్త్రీ పురుషులు మిథునంగా బయటికి వచ్చారు.

346.వేనుని బాహువులనుండి వచ్చిన స్త్రీ పురుషులకి ఏ పేర్లు పెట్టారు? ఏమిచేశారు?
జ. పృథు (విష్ణు అంశ) అర్చి (లక్ష్మి అంశ). వారిరువురికి వివాహం చేసి పట్టాభిషేకం చేశారు.

347. పృథు చక్రవర్తి పాలన ఎలా చేశాడు?
జ. చాలా ధర్మబద్ధమైన పాలన చేశాడు.

348. పృథు చక్రవర్తి దగ్గర జనపదాల అధికారులు ఏమని మొర పెట్టుకున్నారు?
జ. భయంకరమైన కరువు ఏర్పడింది. భూమి నుంచి సత్యోత్పత్తి జరగడం లేదు. ఓషధులు కలగట్లేదు.

349. బాధ కలిగిన పృథు చక్రవర్తి ఏమనుకున్నాడు?
జ. త్యాగబుద్ధిలోనే ఉన్నాను.దేవతలని తృప్తి పరచాను.అటువంటి భూమికూడా దేవతేగా నాకెందుకు ఫలమివ్వదు.

350.పృథు చక్రవర్తి భూమాతనే అడుగుదామనుకున్నప్పుడు భూమాత ఎలా కనబడినది?
జ. గోమాతగా కనబడి పారిపోతున్నట్టుగా కనబడింది.

351. గోమాతతో పృథు చక్రవర్తి ఏమన్నాడు?
జ. నేను ధర్మ బద్ధంగా పాలిస్తున్నప్పుడు నువ్వు చేయవలసినది నువ్వు చెయ్యకపోతే నిన్ను శిక్షించే అధికారం నాకున్నది.

352. భూమాత పృథు చక్రవర్తితో ఏమంటున్నది?
జ. మీ నాన్న పాలనలో జరిగినటువంటి అధర్మ ఫలం ఇప్పుడొస్తోంది.

353. భూమాత పృథు చక్రవర్తి చేసిన ధర్మం గురించి ఏమన్నది?

జ. నువ్వు చేసిన ధర్మం నుంచి ఫలం రావడానికి ఇంకా సమయం పడుతుంది.

354. పృథు చక్రవర్తి భూమాతతో ఏమన్నాడు?

జ. ఇప్పుడు నేనేం చేయాలి.

355. భూమాత ఏమనిబోధ చేసినది?

జ. ప్రకృతి అసలు స్వరూపం తెలిసిన మహర్షులు చెప్పిన ఉపాయాలని పాటిస్తూ వాటియందు గౌరవంతో ఎవరు ప్రవర్తిస్తారో వాళ్ళకి క్షేమం లభిస్తుంది.

356. మొదట ఓషధులు ఎలా సృష్టింపబడ్డాయి?

జ. సృష్టికర్త సంకల్పం చేత భూమి యందు ఓషధులు పెట్టబడ్డాయి.

357. సృష్టికర్త నియమం యేమని పెట్టాడు?

జ. ఎవరు సత్పురుషులో, ఎవరు ధర్మం నందు ఉంటారో వారి వల్ల ఈ ఓషధులు భూమి నుంచి బయటికి వస్తాయి.

358. కరువు ఎందుకు వచ్చింది? ఇప్పుడేం జరిగిందని చెప్పింది భూమాత?

జ. ధర్మం పాటించక, ఆచరించక  ఓషధులన్ని ఎండిపోయాయి.

359. భూమి పృథు చక్రవర్తికి యేమని సలహా ఇచ్చింది?

జ. నువ్వు విష్ణు అంశతో ఉన్న వాడివి కనుక నీకు కావలసినది నానుంచి పిండుకో అన్నది.

360. పృథు చక్రవర్తి కోసం దూడగా వచ్చినవారు ఎవరు?

జ. స్వాయంభు మనువు దూడగా వచ్చాడు. (ముందు ధర్మం చేపింది).

361. పాలు పట్టటానికి పాత్రలా దేనిని వాడాడు?
జ. చేతులు.

362. చేతులు పాత్రగా పట్టడం అంటే అర్థం ఏమిటి?
జ. స్వయం కృషి. (కృషి ద్వారానే భూమిని పొందగలం)

363.ధర్మము, కృషిచేత ఎవరికి సంపదలు వస్తాయి?
జ. మానవులకి.

364. స్వర్గాదిలోకాల్లో ఉన్న వాళ్ళకైనా ఎవరు ఆధారం?
జ. యజ్ఞం వల్లనే జీవనం. యజ్ఞానికి ఆధారం భూమి

365. పృథుచక్రవర్తి తర్వాత భూమి నుండి ధర్మం, ఓషధులు, ఋషులు ఎలా గ్రహించారు?
జ. వాళ్ళు బృహస్పతిని దూడగా తీసుకు వచ్చారు.

366. ఋషులు పాత్రగా దేనిని వాడారు?
జ. మనస్సు,వాక్కు,చెవి, వీటిని పాత్రలుగా చేసి పితికారు .

367. భూమాత నుండి ఋషులు ఏమి గ్రహించారు?
జ. వేదము.

368. దేవ గణాలు ఎవరిని దూడగా, పాత్రగా చేశారు?
జ. ఇంద్రుడు దూడగా, స్వర్ణముని పాత్రగా చేసి అమృతముని పిండారు.

369. పృథు చక్రవర్తి భూమిని ఎలా విస్తరింపచేశాడు?

జ. పాతదైనటువంటి సనాతన ధర్మమర్యాదలు అతిక్రమించకుండా, వివిధ వృత్తుల వాళ్ళక్షేమం కోసం ఏం చెయ్యాలో అన్ని ఏర్పాటుచేశాడు.

370. లోకక్షేమం కోసం పృథు చక్రవర్తి ఎన్ని యజ్ఞాలు చేశాడు?
జ. వంద యజ్ఞాలు.

371. పృథు మహారాజుకి నారాయణుడు ప్రత్యక్షమై ఏమిఅన్నాడు?
జ. నువ్వు పాలిస్తున్న పద్ధతి నాకు నచ్చింది. నీకేం కావాలో కోరుకో.

372. పృథు చక్రవర్తి ఏమి కోరుకున్నాడు?
జ. భగవత్ కథలు వినటానికి నాకు పదివేల చెవులు ఇయ్యవయ్యా.

373.వేనుని చరిత్రద్వారా తెలుసుకున్నది?
జ. పాలనా వ్యవస్థ (political administration)

374. ఋషులు పురాణాలూ, కావ్యాల ఇతిహాసాల ద్వారా మనకి అందించినది ఏమిటి?
జ. వ్యక్తి జీవన విధానం, కుటుంబ జీవన విధానం, సమాజ గతి, పాలనా వ్యవస్థ.

## పృథు చక్రవర్తి పరమగతిని పొందుట, పురంజనోపాఖ్యానము

375. పృథు చక్రవర్తి వంద యజ్ఞాలు పూర్తి చేయటానికి. ఎవరు సహాయం చేశారు?
జ. పృథు చక్రవర్తి కుమారుడైన విజితాశ్వుడు.

376.పృథు చక్రవర్తి ఏ విధంగా ధర్మాచరణ చేశాడు?
జ. భక్తిగా భగవత్ ప్రీతిగా.

377.పృథు చక్రవర్తి చేసిన యజ్ఞాలకు నారాయణుడు మెచ్చి ఏమి వరమిచ్చాడు?
జ.మోక్షం.

378.భగవత్ కథలు వినడం వల్ల ఏమి కలుగుతుంది?
జ. నిరంతరం భగవంతుడే గుర్తుకి వస్తాడు.

379.నిరంతరం భగవంతుని స్మృతి వల్ల ఏమి కలుగుతుంది?
జ.నిరంతరం భగవంతుని స్మృతియే జన్మకి పరమార్ధం.ఆ స్మృతియే మృతి లేని స్థితి ఇస్తుంది.

380. తపస్సు తరువాత, రాజ్యానికి తిరిగి వచ్చిన పృథు చక్రవర్తి ఏమిచేశాడు?
జ.ప్రజలని ఉద్దేశించి బోధ చేశాడు.

381. సంపదలు కావాలంటే వ్యక్తికి ఉండవలసిన లక్షణాలు ఏవి?
జ. సద్గుణాలు,శీల సంపద,ఇతరులు చేసిన ఉపకారం గుర్తుపెట్టుకునుట, పెద్దల్ని సేవించే లక్షణం.

382. పృథు చక్రవర్తి తాను ఎలాపాలన చేసాడని చెప్పాడు? దానివల్ల ఏమి లభించింది?
జ. ధర్మ బద్ధంగా. వేదవేత్తలు జ్ఞానులు, గోవులు, జనార్ధనుడు, ఆయన భక్తులు,ప్రసన్నులయ్యారు.

383. ప్రజలు ధర్మబద్ధంగా ఉండేలా చూడకుండా, పన్నులు వసూలు చేస్తే ఏమౌతుంది?
జ.ప్రజల పాపం రాజు అనుభవిస్తాడు. క్రమంగా రాజు తన గొప్పతనాన్ని కోల్పోతాడు.

384. పృథు చక్రవర్తి ప్రజలతో ఏం చెపుతున్నాడు?
జ. పరమాత్మ పై బుద్ధి పెట్టి మీ వృత్తులు మీరు ధర్మబద్ధంగా పాటించండి.

385.భగవంతుని ఎలా ఆరాదిస్తూ కర్మలను చెయ్యవలెను?

జ. శరీరములో, మనస్సులో,వాక్కులో భగవంతుని ఆరాదించవలెను.

386.దేవతలు, పితృదేవతలు, ఋషులు ఏమన్నారు?
జ. వేనుడు ఏం పుణ్యం చేసాడో పృథు చక్రవర్తి పుట్టాక సద్గతులకి వెళ్ళిపోయాడు.

387. పృథు చక్రవర్తి కర్తవ్యాలని ఎవరికి అప్పచెప్పాడు?
జ. తన కుమారుడైన విజితాశ్వుడు కి.

388.పృథు చక్రవర్తికి, సనత్కుమారుల సంవాదం ఎలాంటి విద్య?
జ.వేదాంత విద్య (బ్రహ్మ విద్య).

389. సనత్కుమారులు బోధించిన బ్రహ్మ విద్య వల్ల పృథు చక్రవర్తి ఏమయ్యాడు?
జ.జీవన్ముక్తుడు.



390. పృథు చక్రవర్తి చరిత్ర వినడం వల్ల దేనికి క్షేమం?
జ. భూమికి క్షేమం.

391. విజితాశ్వుని మరోపేరు?
జ.అంతర్ధానుడు.

392. అంతర్ధానుడు అని పేరెందుకు వచ్చింది?
జ. ఆయనకు అంతర్ధానం అయ్యే శక్తులు ఉన్నాయి.

393. అంతర్ధానుడికి అతని భార్య నభస్వతికి కలిగిన సంతానం ఎవరు?
జ. హవిర్ధానుడు.

394. గొప్పవాడైన బర్హిషదుడుకి మరొక పేరు?

జ.ప్రాచీనబర్హి.

395. ప్రాచీనబర్హి యజ్ఞాలు ఎలా చేశాడు?
జ. యజ్ఞాలు చేయని స్థలం లేకుండా యజ్ఞాలు చేశాడు.

396. బర్హికి ఎంతమంది పుత్రులు? వారికి ప్రాచీనబర్హి ఏమి చెప్పాడు?
జ.పదిమంది. ఈశ్వరానుగ్రహం కోసం తపస్సు చేయమని చెప్పాడు.

397. తపస్సు కోసంబయలుదేరిన వారికి ఎవరు కనిపించారు? ఏమిచెప్పారు?
జ.రుద్రుడు.విష్ణు తత్త్వాన్ని ఉపదేశిస్తాడు.

398. రుద్రుడు విష్ణుతత్త్వాన్ని ఉపదేశించిన ప్రదేశం ఏది?
జ.గురువాయూరప్ప క్షేత్రం.

399. యజ్ఞ కర్మలయందు నిమగ్నుడై ఉన్న బర్హితో నారదుడు ఏమన్నాడు?
జ.నీవు చేసినకర్మల వల్ల బాహ్యత్వం పెరుగుతుంది. అంతర్ముఖుడవై నీ అసలు స్వరూపము తెలుసుకొమ్మని ఉపదేశించాడు.

400. నారదుడు,ప్రాచీనబర్హికి ఎవరి కథ చెప్పాడు?
జ.పురంజనుడి వృతాంత్తము.

401. పురంజనుడి స్నేహితుడి పేరు ఏమిటి? అర్ధం ఏమిటి?
జ.అవిజ్ఞాతుడు. (అంటే ఆయన ఇలా ఉంటాడు అని ఎవరికి తెలియదు)

402.స్నేహితుడికి చెప్పకుండా బయటికివచ్చిన పురంజనుడు తిరుగుతూ ఏమిచూశాడు?
జ. హిమవత పర్వత కొండచరియలపై నగరాన్ని చూశాడు.

403. నగరానికి ఎన్ని ద్వారాలు ఉన్నాయి?
జ. తొమ్మిది.

404.ఆ పట్టణం ఎలావుంది?
జ. చాలా అద్భుతంగా ఉంది .కానీ మనుష్యులు ఎవరు కనబడలేదు.

405.పురంజనుడికి ఆ ఉద్యానవనంలో ఎవరు కనబడ్డారు?
జ. అందమైన స్త్రీ.

406.ఆ అందమైన స్త్రీ దగ్గర ఎంతమంది సేవికులున్నారు?
జ. పదిమంది.

407. ఆ పదిమంది సేవికులకి ఎంతమంది సేవికలున్నారు?
జ.వందమంది సేవకులు, సేవికలు.

408. సేవకులు, సేవికలు అందరు ఎవరిని సేవించుకుంటున్నారు?
జ.మహారాణిని.

409.మహారాణి ఎవరితో ఉన్నది?
జ.రక్షకురాలైన అయిదు పడగల మహా సర్పముతో.

410. పురంజనుడు సౌందర్యంగా ఉన్న మహారాణిని యేమని అడిగాడు?
జ.నువ్వెవరు, ఈభటులెవరు,మీ నాయకుడెవరు.

411. మహారాణి పురంజనుడిని ఏమడుగుతుంది?
జ.నన్ను వివాహం చేసుకో, నా సేవకులు ఈ పురము అన్నింటిని, కలిసి అనుభవిద్దాం.

412.ఆనందించిన పురంజనుడు ఏమి చేశాడు?

జ.మహారాణిని చేపట్టి, సంతానం పొంది ఆ రాజ్యంలో స్థిరపడిపోయారు.

413. పురంజనుడి పట్టణానికి ద్వారాలు ఎక్కడెక్కడ ఉన్నాయి?

జ.5 ద్వారాలు తూర్పున, 1 ద్వారము దక్షిణం, 1 ద్వారం ఉత్తరం, 2 ద్వారాలు పడమట.

414. తూర్పువైపుఏ ఏ ద్వారాల నుంచి బయటికి వెడతాడు?

జ.తూర్పువైపు పక్కపక్కన ఉన్న ఖద్యోతము, ఆవిర్ముఖి అనే ద్వారాల నుంచి.

415. తూర్పు ద్వారాల నుండి పురంజనుడి ఎవరితో కలిసి ఎక్కడికి వెడతాడు?

జ.ద్యుమంతుడు అనే మిత్రుడితో కలిసి విభ్రాజితం అనే దేశానికి వెడతాడు.

416. పురంజనుడు సౌరభం అనే దేశానికి యే ద్వారాల నుంచి ఎవరితో వెడతాడు?

జ.తూర్పువైపు ఉన్న నళిని,నాలిని అనే మరో రెండు ద్వారాల నుంచి అవధూతునితో వెడతాడు.

417. పురంజనుడు తూర్పు దిక్కున ఉన్న ముఖ్య అనే ద్వారంనుంచి ఎంతమంది మిత్రులతో ఎన్ని దేశాలకి వెడతాడు?

జ.రసజ్ఞునితో బహూదన, విపణునితో ఆపణ అనే దేశాలకి వెడతాడు.

418.దక్షిణాన ఉన్న పితృహు అనే ద్వారం గుండా ఎవరితో ఎక్కడికి వెడతాడు?

జ.శ్రుతధరునితో కూడి పాంచాల దేశమునకు వెడతాడు.

419.ఉత్తరమునందు ఉన్న ద్వారం పేరేమిటి? ఎవరితో ఎక్కడికి వెడతాడు?

జ.దేవహూ. శ్రుతధరునితో గూడి ఉత్తర పంచాల దేశానికి వెడతాడు.

420. పడమటి 2 ద్వారాల లో ఎవరితో ఎక్కడికి వెడతాడు?
జ.ఆసురీ ద్వారం గుండా దుర్మదునితో గ్రామిక దేశానికి, నిరృతి ద్వారం గుండా లుబ్ధకుని తో గూడి వైశస దేశానికి వెడతాడు.

421. పురంజనుడు ఇద్దరు గుడ్డివాళ్ళ సహాయంతో ఏమిచేస్తాడు?
జ. కళ్ళు కలిగిన పురంజనుడు ఒక గుడ్డివాడి సహాయముతో పనులు చేస్తాడు, మరొకడి సహాయముతో నడుస్తాడు.

422. పురంజనుడు అంతఃపురంలో ఏమి అనుభవిస్తుంటాడు?
జ. మోహము,దుఃఖము, ప్రస్సన్నత ,అన్ని అనుభవిస్తూ, భార్య పురంజని ఏది చేస్తే అదే చేస్తూ కర్మ బంధాల్లో చిక్కుకున్నాడు.

423. పురంజనుడి పురం మీదికి దాడికి వచ్చినాడు ఎవరు?
జ.చండవేగుడు అనే గంధర్వుడు.అతనితో 360 మంది గంధర్వులు, 360 మంది గంధర్వ కాంతలు వచ్చారు.

424. గంధర్వులందరు యే రంగులో ఉన్నారు?
జ.పురుషులు తెల్లగాను,స్త్రీలు నల్లగాను.

425. చండవేగుడి నుంచి రక్షించవలసిన భాద్యత ఎవరిది?
జ. ప్రజాగరుడు అనే 5 పడగల సర్పానిది. ( ప్ర జాగరుడు అంటే ఎప్పుడు మెలకువగా ఉండేవాడు)

426. కాలుడు కుమార్తె జర ఎవరిని పెళ్ళుచేసుకో అని అడిడింది?
జ. నారదుడిని.

427. పెళ్లి చేసుకోను అని నారదుడు జరని ఎవరిదగ్గరికి పంపించాడు?
జ. యవన రాజ్యానికి రాజైన భయుని దగ్గరికి.

428. భయుడి దగ్గరికి వచ్చిన జరకి ఏమిచ్చాడు? ఏమి చెప్తాడు?
జ. చెల్లెమ్మ అని పిలిచి .తన సైన్యం ఇచ్చి, తన తమ్ముడైన ప్రజ్వారుడితో కలిసి పురంజన పట్టణాన్ని ముట్టడించమని చెప్తాడు.

429.గంధర్వులు, యవనులతో యుద్ధం చేస్తున్న సర్పం ఏమైయింది?
జ.అలసిపోయి యుద్ధం చేయలేక పురం వదిలి వెళ్ళిపోయింది.

430.భయుడు వచ్చి ఏమి చేశాడు?
జ. పురంజనుడిని లాగి పురం బయట పడేశాడు.

431.పురంజనుడు భయుడు తనని లాగే సమయంలో ఎవరిని తలచుకున్నాడు? ఎవరిని గుర్తు తెచ్చుకోలేదు?
జ.భార్యనితలచుకుంటూ.అవిజ్ఞాతుడిని గుర్తు తెచ్చుకోలేదు.

432. పురంజనుడు తర్వాత జన్మలో ఎలా పుడతాడు?
జ.విదర్భ దేశాధిపతికి కుమార్తె గా పుట్టాడు.

433.ఆమె (వైదర్భి) ఎవరిని వివాహం చేసుకున్నది?
జ.పాండు దేశాధిపతి అయిన మలయధ్వజుడ్ని.

434.భార్యలో కలిసి వానప్రస్థానికి వెళ్లిన మలయధ్వజుడు ఏమయ్యాడు?
జ.సాధన చేసి అంతర్ముఖుడై బ్రహ్మము నందు మనస్సు నిలిపి సమాధి స్థితిలో బ్రహ్మమును పొందాడు.

435. మలయధ్వజుడు బ్రహ్మమును పొందినతర్వాత అక్కడికి ఎవరు వచ్చారు?
జ. మలయధ్వజుడి భార్య చితి పేర్చి తాను అందులో పడిపోదామని ప్రయత్నిస్తూ ఉంటే ఒక వృద్ధ బ్రాహ్మడు వచ్చాడు.

436. వృద్ధ బ్రాహ్మడు మలయధ్వజుడి భార్యతో ఏమన్నాడు?
జ.నీవెరివి, నీవు ఎవరికొరకు దుఃఖిస్తున్నావు పడుకున్న ఇతడెవరు?

437. వృద్ధ బ్రాహ్మడు ఎవరు?
జ. పూర్వ జన్మలో పురంజనుడి స్నేహితుడు, అవిజ్ఞాతుడు.

438. అవిజ్ఞాతుడు, పురంజనుడు వారి పూర్వజన్మలో ఎవరు?
జ. మానస సరస్సు దగ్గర తిరుగుతున్న హంసలు.

439. ఇంద్రియ భోగాల కోసం బయటికి వెళ్లిన హంసకి ఏం జరిగింది?
జ. పురంజనుడుగా వెళ్లి పురంజనితో వెళ్లి పురంలో చిక్కుకుపోయారు.

440. మలయధ్వజుడి భార్యకి బ్రాహ్మణుడు చెప్పిన విషయం ఏమిటి?
జ.నీవు పురంజనుడివి కాదు, విదర్భ రాజపుత్రికవి కాదు. మనిద్దరం హంసలము.

441. స్వస్వరూప జ్ఞానము కలిగిన విదర్భ రాజపుత్రిక ఏమైయింది? బ్రాహ్మణుడు ఏమయ్యాడు?
జ.వెంటనే హంసలుగా మారారు.

442. నవ ద్వారాపురం అంటే ఏది? నవద్వారాపురంలో మహారాణి ఎవరు?
జ. దేహము, బుద్ధి.

443. మహారాణి దగ్గర ఉన్న సేవకులు, రక్షకుడు ఎవరు?
జ. ఇంద్రియములు, ప్రాణం. (ప్రాణ, సమాన, అపాన, వ్యాన, ఉదాన)

444.నళిని నాళిని అనే ద్వారాలు అంటే? స్నేహితుడు? దేశం?

జ. నాసికా రంధ్రాలు. గాలి. సౌరభం.

445. తూర్పున ఉన్న ఒక్క ద్వారం ఏది? దేశము స్నేహితుడు ఎవరు?

జ.ముఖం (విపణుడు, ఆపణుడు) ఆహారం .నాలిక.

446. దక్షిణాన ఉన్నా ద్వారాలు ఏవి? స్నేహితుడు ఎవరు?

జ. చెవులు. వినడం.

447.పడమర వైపు ద్వారాలు ఏవి?

జ.మాలిన్యం విసర్జించే ద్వారం. అసురీ ద్వారం కామశక్తితో తుచ్ఛమైన భోగాలని అనుభవించే స్థితి.

448. పురంజనుడు సహాయం తీసుకునే గుడ్డివాళ్ళు ఎవరు?

జ. చేతులు,కాళ్ళు.

449. పురంజనుడు అంతఃపురంలోకి వెళ్లి అనుభవించేవి ఏవి? ఎవరితో వెడతాడు?

జ. సత్వ రజో, తమో గుణములు. మనస్సు.

450. చండవేగుడు అంటే ఎవరు? వాడితో ఉన్న గంధర్వులు?

జ.కాలం. పగలు, రాత్రి.

451. కాలుడి కూతురు జర అంటే ఎవరు?

జ. కాలుడు అంటే కాలం. జర అంటే ముసలితనం.

452.జర సైన్యం యవనులు అంటే ఎవరు? ప్రజ్వాలుడు ఎవరు?

జ. రోగాలు. తాపం, ఉష్ణాదులు.

453.కోటలోంచే వెళ్ళిపోయినా సర్పం ఎవరు? భయుడు అంటే?
జ.ప్రాణం.మృత్యువు.

454.మలయధ్వజుడు, ఆయన భార్య, అయన సంతానం ఎవరు?
జ. భక్తిలో కూడిన బుద్ధి, వ్యామోహంతో కూడిన బుద్ధి. భక్తి యొక్క శాఖలు.

455.మలయధ్వజుడు మూడు సరస్సులలో స్నానం చేయడం అంటే?
జ.త్రికరణలు (చెవులతో వింటాం, నోటితో కీర్తిస్తాం, మనస్సుతో మననం చేస్తాం)

456.అవిజ్ఞాతుడు వచ్చి ఏమి చేశాడు?
జ. పురంజనుడికి స్వస్వరూప జ్ఞానంకలిగించాడు.

457. పురంజనోపాఖ్యానం ఎవరిది అని ప్రాచీన బర్హిని అడిగాడు నారదుడు?
జ. తన కథే అని తెలుసుకున్నాడు ప్రాచీన బర్హి.

## భరతోపాఖ్యానం-1

458. పురంజనోపాఖ్యానం లాంటి సందేశాన్ని తెలిపే కథాప్రక్రియని ఏమంటారు?
జ. పరోక్షకథనం (allegory).

459. ప్రచేతసులు ఎంతమంది?
జ. 10 మంది.

460. ఎవరి అనుగ్రహం వల్ల ప్రచేతసులు తపస్సుని ఆచరించారు? ఫలితంగా విష్ణువు ద్వారా లభించిన ఆదేశం ఏమి?
జ. రుద్రుడు; ప్రవృత్తి మార్గంలో ఉంటూ ధర్మము ద్వారా నన్ను కొలుచుకోవాలి అని.

461. తపస్సు చేత పవిత్రులైన ప్రచేతసులకొరకు వనదేవతల వల్ల ఉద్భవించిన దివ్య సంతానం ఎవరు?
జ. మారిష (కన్య).

462. ప్రచేతసులకు మారిష ద్వార కలిగిన సంతానం?
జ. దక్షుడు (చక్షుష మన్వంతరం).

463. సతీ దేవి యొక్క తండ్రి అయిన దక్షుడు ఏ మన్వంతరానికి చెందినవాడు?
జ. స్వాయంభువ మన్వంతరం.

464. స్వాయంభువ మన్వంతరం లో దక్షుడు చేసిన దోషము ఏమిటి?
జ. అహంకారంతో శివుని పరమేశ్వర తత్త్వాన్ని గ్రహించలేక సాధారణ దేవతగా అవమానించడం.



465. శివ మహిమ్నా స్తోత్రం రచించిన వారు?
జ. పుష్పదంతుడు.

466. ఉత్తానపాదుడి సోదరుడు ఎవరు?
జ: ప్రియవ్రతుడు.

467. ప్రియవ్రతుడి విశిష్టత ఏమిటి?
జ: భగవతః (భగవత్ రసికుడు) ఆత్మారామః (జ్ఞాని).

468. ప్రియవ్రతుడు ఎవరిని వివాహం చేసుకున్నాడు?
జ. బర్హిష్మతీ.

469.ద్వీప విభజన చేసిన చక్రవర్తి ఎవరు?
జ. ప్రియవ్రతుడు.

470. ప్రియవ్రతుని గొప్పతనం ఏమిటి?
జ: భూమిని సప్త ద్వీపాలుగా విభజన చేసాడు.

471.జంబూ ద్వీపానికి ఎవరు అధిపతి?
జ. అగ్నిధ్రుడు.

472. అగ్నిధ్రుడి పత్ని?
జ: పూర్వచిత్తి (అప్సరస).

473.వర్ష (దేశ) విభజన చేసిన చక్రవర్తి ఎవరు?
జ. అగ్నిధ్రుడు

474.నాభి పత్ని ఎవరు?
జ: మేరు.

475.నాభి మేరు దంపతులకు స్వయం నారయణుని అంశ సంతానంగా అవతరించిందెవరు?
జ. ఋషభదేవుడు.

476. ఋషభదేవుడి ఎవరిని వివాహం చేసుకున్నాడు?
జ. ఇంద్రుని పుత్రిక జయంతిని.

477. ఋషభదేవుడికి ఎంతమంది సంతానం?
జ: 100 మంది.

478. భరతవర్షం అనే పేరు ఎలా వచ్చింది?
జ. ఋషభదేవుడి జేష్ఠ పుత్రుడు భరతుడి పాలన తరువాత ఆ వర్షం భరతవర్షం అని పేరు పొందింది.

gurujnanam.org

479. భరత అనే పదానికి అర్థం?
జ. అగ్నిహోత్రుడు, పరమేశ్వరుడు.

480.అవసరాన్ని ఎవరు నిర్దేశిస్తారు?
జ. ధర్మం.

481.వేదచోదిత ధర్మాచరణని ఏమంటారు?
జ. యజ్ఞం.

482. కర్మ ద్వారా ఏర్పడిన ఫలం పేరు?
జ. అపూర్వం (మునుపులేనిది, అదృష్టం {కనబడనిది}).

483. ఆత్మ నైపుణ్యం అనగా ఏమిటి?
జ. అంటుకోకుండా చేయడం, అర్పించడం.

484. కర్మాచరణ, కర్మ యోగములు అనగా ఏమి?
జ. నేను చేస్తున్నాను అనే భావన, చేసిన ఫలం నాకు అక్కరలేదు. ఈ రెండు లేకుండ కర్మ చేస్తే కర్మాచరణ అని ఆ రెండు విడిచిపెట్టి కర్మ చేస్తే కర్మయోగం అని అంటారు.

## భరతో ఫాఖ్యానం-2

485. ఆత్మ నైపుణ్య మృదిత కాషాయ అనగా ఏమిటి?
జ. కర్మ అంటుకోకుండా చేయడం, కర్మను భగవానునికి అర్పించడం.

486. కర్మాచరణ అనగా ఏమిటి?
జ. నేను చేస్తున్నాను అనే భావన విడిచి పెట్టి కర్మను చేయడం.

487. కర్మయోగం అనగా ఏమిటి?

జ. కర్మ చేసిన ఫలం నాకు అక్కరలేదని ఈశ్వరార్పణం చేయడం.

488.కర్మయోగి అనగా ఎవరు?

జ. అహంకారాన్ని, ఫలాపేక్షను విడిచిపెట్టి కర్మను చేసినవాడు.

489. ఆత్మనైపుణ్యాన్ని భగవద్గీతలో ఏమని పిలిచారు?

జ. యోగ కర్మసు కౌశలం.

490. ఆత్మ నైపుణ్యం తో కర్మను చేయగలిగితే ఏమి లభిస్తుంది?

జ. చిత్తశుద్ధి.

491.భరతుడు రాజ్యం నిష్క్రమించిన తరువాత ఎక్కడికి చేరుకున్నాడు?

జ. ప్రస్తుతం నేపాల్ లోఉన్న గండకీ నది దగ్గర, పులహాశ్రమం.



492. గండకీ నదికి మరొక పేరు ఏమిటి?

జ. చక్రనది.

493.గండకీ నది ప్రాశస్త్యము ఏమిటి?

జ. ఈ నదిలో శ్రీ మహావిష్ణువు సాలగ్రామరూపుడై ఉంటాడు.

494. పులహాశ్రమములో భరతుడు ఏ స్థితి లో వున్నాడు?

జ. వానప్రస్థ.

495. పూలహాశ్రమములో భరతుడు దేనివల్ల స్నేహానుబద్ధుడైనాడు?

జ. కృష్ణ మృగం (లేడి పిల్ల).

496.ఎందువలన భరతుడు లేడి పిల్ల మోహం లో పడ్డాడు?
జ. మూడు పూర్వ జన్మల ప్రారబ్ధ ప్రభావం.

497. బ్రహ్మాక్షర ఉపాసనని ఏమని కూడా పిలుస్తారు?
జ. ప్రణవోపాసన; గాయత్రీ ఉపాసన.

498.లేడి ధ్యానంలో మరణించిన భరతుడు మరుసటి జన్మలో ఏ యోనిలో జన్మించాడు?
జ. లేడి పిల్లగా.



499.లేడి జన్మలో వున్న భరతుడిని ఏది రక్షించింది?
జ. పూర్వజన్మ భగవతారాధన అను స్మృతి రూపములో రక్షించింది.

500. లేడి జన్మలో వున్న భరతుడు ఎక్కడికి చేరుకున్నాడు?
జ. పులహాశ్రమానికి.

501. లేడి పిల్ల శరీరంలో వున్న భరతుడు ఎలా దేహ త్యాగం చేసాడు?
జ. గండకీ నది లో శరీరం విడిచిపెట్టాడు.


502. జీవన్ముక్తావస్థ అనగా ఏమి?
జ. తన శరీరావస్థని చూస్తూ సాక్షిగా ఉండటమే.

503. పుట్టుకతోనే జీవన్ముక్తుడైన భరతుడు ఎక్కడ జన్మించాడు?
జ. అంగిర వంశానికి చెందినటువంటి ఒక విప్రోత్తముడి రెండవ భార్యగర్భంలో.

504.పుట్టుకతోనే జీవన్ముక్తుడైన భరతుడు ఎలా వ్యవహరించాడు?


జ. జఢుడిలా.

505. భరతుడికి ప్రస్తుత జన్మలో (విప్రుని కుమారునిగా) నామమేమిటి?
జ. బ్రహ్మవేత్తలకు నామముతో పని లేదు.కాని ఆ మహాత్ముని గురించి మనము తెలుసుకునేందుకు జఢ భరతుడు అంటారు.



506. అనుస్మృతి అనగా ఏమి?
జ. పూర్వ జన్మ జ్ఞాపకం. ఇది మహాత్ములకు వరం.

507. సమీపకాలంలో జీవన్ముక్తులుగా ఉండి ప్రారబ్ధ కర్మలు అనుభవించిన వారు ఎవరు?
జ. రామకృష్ణ పరమహంస, రమణ మహర్షి.



508.మరణ సమయమునందు ఏమి గుర్తుకు వస్తుంది?
జ. జన్మంతా నీ మనసు దేనిని అంటిపెట్టుకుని ఉందో అదే గుర్తుకువస్తుంది.

509. హరి దాసులు ఎవరు?
జ. జీవన్ముక్తులు.

# శ్రీ గురువు గారి ఆశీస్సులతో

## Contributors of Sri Bhagvatham CD#2.1-3.1 –Nov 2018

| | | |
|---|---|---|
| 1 | Santhi Akella | California |
| 2 | Sri Lakshmisarath Sivalenka | India |
| 3 | Satyasri Vepa | North Carolina |
| 4 | Rama Jayanthi | Ohio |
| 5 | Radhika Kameswari | Arizona |
| 6 | Sudhakar Mallampalli | California |
| 7 | Rajeshwari Pulusuri | North Carolina |
| 8 | Srinivas Timmaraju | Texas |
| 9 | Vennalakanti Padma | North Carolina |
| 10 | Padma Achanta | North Carolina |
| 11 | Dharmendra Sarkar | California |
| 12 | Srinivas Yanamandra | California |

సర్వం శ్రీకృష్ణచరణారవిందార్పణమస్తు



gurujnanam.org